సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 51

సోమవారం 13-5-2024

SIMULTANEOUSLY PRINTED AT WARANGAL | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM



'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

మన కోసం
మనతోనే
మన కేసీఆర్

జై తెలంగాణ! జైజై తెలంగాణ!!





తెలంగాణ విముక్తికి పిడికిలెత్తిన ఉద్యమకారుడు
స్వరాష్ట్ర కల సాకారం చేసిన సాధకుడు
పదేండ్లలో రాష్ట్రం దశ మార్చిన పాలకుడు
సబ్బండ వర్గాల ఆకాంక్షల పోరాటయోధుడు
మన కోసం కొట్లాడే మన సైనికుడు..


ఆగమైన తెలంగాణను సరిదిద్దే మన నాయకుడికే ఓటేద్దాం!

ఏమార్చిన మార్పు.. తిరగరాద్దాం తీర్పు!

నిన్న.. నేడు.. రేపు..

తెలంగాణ రక్షణ కవచం బీఆర్ఎస్

కారు గుర్తుకే ఓటేద్దాం
బీఆర్ఎస్‌నే గెలిపిద్దాం



VOTE FOR CAR

భారత రాష్ట్ర సమితి



మంచిమాట

సకామ కర్మ - అకామ కర్మ

మనిషి ఏ పనీ చేయకుండా ఒక్క క్షణం కూడా ఉండటం అసాధ్యం. ఏమీ చేయటం లేదు అన్నప్పుడు ఆ మాట పలకటం కర్మయే కదా! అప్పుడు కూడా గాలి పీల్చటం, తిన్న దానిని అరిగించుకోవటం వంటి పనులు చేస్తూనే ఉంటాము కదా! ఇవి కూడా మనని పట్టి బంధించి మరొక జన్మకి కారణం అవుతాయా? అనే సందేహం కలగటం సహజం. దీనిని గురించి భగవద్గీతలో కృష్ణుడు వివరంగానే చెప్పాడు. 'అకర్మ' అని. నిజానికి జీవించి ఉండటమే ఒక కర్మ.

జీవ చైతన్యం జీవికి ధర్మం. దాని వ్యక్త స్వరూపం కదలిక. అప్పుడే పుట్టిన బిడ్డ కాళ్ళు చేతులు కదిలిస్తూ ఏడుస్తాడు. బిడ్డ ఏడవక పోయినా, కదలికలు లేకపోయినా పెద్దలు ఏడవ వలసి ఉంటుంది. ఏదోవిధంగా ఏడిపించే ప్రయత్నం చేస్తారు. అస్తవ్యస్తంగా ఉన్న ఈ కదలికలు, ధ్వనులు క్రమేణా వయస్సుని బట్టి సంకల్పాలతో సంబంధం కలిగి ఉంటాయి. అంటే అభిప్రాయానికి అనుగుణంగా కదలికలు ఉంటాయి. మొదట్లో నవ్వటం, ఏడవటం అకారణంగా ఉంటాయి. ఇది నిష్కామకర్మ. రాను రాను వయసుని బట్టి ఈ ఏడుపులు, నవ్వులు సకారణంగా మారుతాయి. తెలిసినవారిని చూసి నవ్వటం, కొత్తవారిని చూసి ఏడవటం, ఆకలి వేస్తే, చీమ కుడితే ఏడవటం సకారణమేగా. పైగా ఎవరైనా వచ్చి తన బాధ తీర్చాలనే కోరికతో చేసినదే కనుక సకామ కర్మ అవుతుంది.

చేతులు కదలి నోటి దాకా వచ్చి వ్రేళ్ళు చీకటం మొదలవుతుంది. చేతిని నోటిదాకా తీసుకు రావటానికి ఎంత తాపత్రయ పడతారో పిల్లలు గమనించ వచ్చు. ఆ పైన ఆ కదలిక వస్తువులను చూపించటం, పట్టుకోవటంలో నేర్పు చూపించటంగా మార్పు చెందుతుంది. అదే విధంగా ఏడవటం ఊ కొట్టటంగా మారి, క్రమంగా మాటలుగా పరిణామం జరుగుతుంది. తన అభిప్రాయాలు, కోరికలు వ్యక్తీకరించటానికి మాటలని ఉపయోగించటం జరుగుతుంది. ఇది ఎంతో సహజంగా, అప్రయత్నంగా జరిగే పరిణామం.

మనోవాక్కాయకర్మలచే మొదలైన దివ్యకర్మ మానవకర్మగా మలచ బడింది. అకామకర్మ బంధించదు. సకామకర్మ బంధ హేతువు. అకామ కర్మ సకామకర్మగా రూపాంతరం చెందుతున్న క్రమంలో అది ఘనీభవించి తాను అందులో బంధించబడకుండా జాగరూకత వహించవలసి ఉంటుంది. ప్రతిదీ లాభనష్టాల లెక్కలతో బేరీజు వేయటానికి అలవాటు పడిన మనిషికి ఇది సాధ్యమా? అనిపించటం సహజం. కానీ ఆ విధంగా ఉండటమే సహజం. స్వార్థపూరితంగా ఉండటమే తెచ్చిపెట్టుకున్న లక్షణం. ఎందుకంటే పుట్టిన కొత్తలో ప్రతి మనిషి శిశువుగా ఏ పని చేసినా ప్రయోజనాన్ని ఆశించి చేయటం ఉండదు. చిన్నపిల్లలు ఒక్క క్షణం కూడా ఒక చోట స్థిరంగా కూర్చోరు. గిరా గిరా తిరుగుతూనే ఉంటారు. ఎందుకు అని అడిగితే 'ఊరికే' అంటారు. పెరిగి పెద్ద అయినాక కూడా ఏదో ఒక పని చేయకుండా ఉండలేము. దానికి ఒక సంకల్పం, లేదా కోరిక జత చేయటం జరుగుతుంది. ఈ కోరిక బంధిస్తుంది. ఎలాగూ ఏమి చేయకుండా ఉండలేము కనుక ఏదైనా మనస్సుతో, వాక్కుతో, చేతులతో ఫలితాన్ని ఆశించకుండా పదిమందికి ఉపయోగపడే పని చేస్తూ ఉంటే అది నిష్కామ కర్మ అవుతుంది. దేహం ఉన్నంత వరకు కర్మాచరణ మాన రాదు.

గాలి పీల్చటం, గుండె కొట్టుకోవటం, ఊపిరితిత్తులు పని చేయటం మన ప్రయత్నం లేకుండా ఎట్లా జరుగుతున్నాయో నిత్యకృత్యాలు కూడా అదేవిధంగా యాంత్రికంగా, అప్రయత్నంగా కొనసాగిస్తూ, వాటిలో మానసికంగా లగ్నం కాకుండా ఉన్నప్పుడు సకామకర్మ అవదు. కనుక బంధించదు, మరొక జన్మకి కారణం కాదు.

– డా. ఎన్. అనంత లక్ష్మి

ఆధ్యాత్మికం

పరమ లక్ష్యం!

మన లక్ష్యం ఏమిటి? అన్న ప్రశ్న లోకంలో తరచుగా వినబడుతూ ఉంటుంది. దానికి ఒక్కొక్కరు ఒక్కోరకమైన సమాధానాన్ని ఇస్తుంటారు. ఈ ప్రపంచం మాయ అనుకున్న వారు మనం ఎక్కడి నుంచి వచ్చామో అక్కడికే పోతామని అంటారు. శూన్యవాదులు మనం శూన్యం (ఏమీ లేని వస్తువు) నుంచి వచ్చాము కనుక శూన్యంలోకే పోతామని అభిప్రాయపడతారు. భౌతికవాదులు మాత్రం కోరుకున్న భౌతిక పదార్థాన్ని పొందడమే లక్ష్యం అంటారు. కొందరు ఆధ్యాత్మిక వేత్తలు మనం భగవంతుని నుంచి వచ్చాము కనుక అతనిలోనే కలిసిపోతామని చెప్తుంటారు. అభ్యుదయవాదులు కొందరున్నారు. వారు ఐహిక సుఖమే పరమ లక్ష్యం అంటారు. మతవాదులున్నారు, వారు పరలోకంలో సుఖపడడమే తమ లక్ష్యం అంటారు. ఈ విధంగా ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా మానవ లక్ష్యాన్ని పేర్కొంటారు.

అన్ని జన్మల్లోకెల్లా మానవ జన్మ ఉత్తమమైనది. కనుక ఇతర ప్రాణుల కంటే మానవుడు శ్రేష్ఠుడు. అంతేకాదు, ఇతర ప్రాణులకు లేని లక్ష్యం మానవునికి ఉంది.



నాల్గు పురుషార్థాలలో అర్థ కామాలను లక్ష్యంగా పెట్టుకున్న వాళ్ళున్నారు. నిజానికి మానవుడు ధనాన్ని సంపాదించి, సుఖపడరాదని ఏ ధర్మ గ్రంథమూ చెప్పదు. అయితే ధర్మబద్ధంగా ధనార్జన చేయాలని, ధార్మిక ప్రవృత్తిలోనే కోరికలను తీర్చుకోవాలని, శాస్త్రాలు ఉద్బోధిస్తున్నాయి. అందుకే పురుషార్థాలలో మొదట ధర్మాన్నే పేర్కొన్నారు.

తనకే కాక, తోటి ప్రాణులకు ఏది హితకరమైందో, ఆ కర్మకే ధర్మమని పేరు. ధర్మానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే దాన్ని స్వార్థం అంటారు. ఆచారం వ్యక్తిగతమైంది కావచ్చు కాని, ధర్మం సర్వనిష్ఠమైంది. అందరికీ ఆమోదయోగ్యమైంది. అందుకే పురుషార్థాలను సాధించాలనుకున్న వ్యక్తి మొదట ధర్మపరుడు కావాలి.

ధర్మాన్ని దారిబత్తెంగా చేసుకుని ప్రయాణించే వారికి ధనప్రాప్తి, సుఖప్రాప్తి కలుగుతాయి. అంతేకాదు, ఆ రెండింటికీ మించి మోక్ష ప్రాప్తి కూడా కలుగుతుంది. అందువల్ల మానవుని లక్ష్యం కేవలం ధనార్జనతోపాటు సుఖప్రాప్తి మాత్రమే కాదు, మోక్షం సాధించడమే పరమ లక్ష్యమని తెలుస్తుంది.

మోక్షం అంటే విడుదల. దుఃఖం నుంచి బయటపడటమే మోక్షం. అదే మానవుని పరమ లక్ష్యం. బంధనాల్లో చిక్కుకోవడానికి కేవలం కర్మలు చేస్తే చాలు. కాని వాటి నుంచి బయట పడటానికి ధార్మికుడు కావాలి. ధర్మబద్ధమైన కర్మలు చేస్తూ, ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవాలి. ఈ శరీర తత్వంతోపాటు, ఈ శరీరంలో బంధింపబడిన తానెవరో తెలుసుకోవాలి. అంతేకాదు, మోక్ష ప్రదాతను గుర్తించాలి. శరీరం ఉంది. తాను ఉన్నాడు. శరీరం బంధనం. దాన్ని విడిచిపెడితే మోక్షం. కానీ ఎట్లా విడిచి పెట్టాలి? అందుకు చేయవలసిన పనేమిటి? తెలిస్తే గాని పరమ లక్ష్యాన్ని అందుకోలేం.

– ఆచార్య మసన చెన్నప్ప

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

ఆమె ధర్మపత్ని...

అహం ఎప్పుడూ కూడా మనిషిని పాషాణం అయ్యేట్టు చేస్తుంది. కామం తీరలేదనుకోండి. శత్రుభావం పెంచుకుని అవతలి వాళ్ళ మీద కఠినంగా వ్యవహరించేటట్లు చేస్తుంది. అయితే ప్రేమ మాత్రం కరిగిపోయే లక్షణాన్ని పొంది ఉంటుంది. అవతలివాళ్ళల్లో ఎన్ని లోపాలున్నా వారి నాశనాన్ని ప్రేమ కోరుకోదు. వారు బాగుపడాలి, సంస్కరింపబడాలి, జీవితంలో వృద్ధిలోకి రావాలి... అని కోరుకుంటుంది తప్ప వారిపట్ల ద్వేషం పెంచుకోదు. అందుకే ప్రేమ అవసరం. దానికి పూర్వ పరిచయం లేదు, భవిష్యత్తు మాత్రం ఉంది. దానికి పునాది ప్రేమలోనే ఉంది తప్ప కామంలో లేదు. అందుకే ఆమె 'ధర్మపత్ని' తప్ప కామపత్ని కాదు. ఇంత పెద్ద ప్రాతిపదికచేసి గృహస్థాశ్రమ ప్రవేశం చేయిస్తారు. కాబట్టి వివాహం నిర్ణయించేటప్పుడు పెద్దలు ముందుగా శీలం, వయసు, వృత్తి పరిశీలిస్తారు... తరువాత అభిజనం... అంటే రెండు పక్కల వంశాలు ఎంత గొప్పవి! ఆ వంశాలలో పూర్వీకులు ఎంత గొప్పగా ప్రవర్తించారో అన్న జిజ్ఞాసతో ఆ వంశానికి కీర్తిప్రతిష్ఠలు జోడించేలా ప్రవర్తించాలి. అందువల్ల వాటిని కూడా పెద్దలు పరిశీలిస్తారు.

రామాయణంలో... రామచంద్రమూర్తి శివధనుర్భంగం చేయగానే జనకమహారాజు వచ్చి సీతను అప్పగించాడు, రాముడు వెంట తీసుకెళ్ళాడు... అని చాలామంది అనుకుంటూంటారు. కానీ అది సరికాదు. బాలకాండను అయోధ్యకాండతో కలిపి చదివితే... ఆశ్చర్యపోతాం.. వారి సంస్కారం చూసి... శివధనుర్భంగం కాగానే జనకమహారాజు జలకలశంతో గబగబా వచ్చి..''మొదట ఇచ్చిన మాట ప్రకారం శివధనుర్భంగం చేసినవారికి నా కూతురును ఇస్తానని చెప్పాను... ఆ పని నీవు విజయవంతంగా చేశావు కాబట్టి ఇదుగో నా కుమార్తె..స్వీకరించు''... అన్నాడు. దానికి రాముడు....''ఒక పిల్ల నాకు భార్య కావాలంటే చూడాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. అవి మా తండ్రిగారు చూడాలి. మా పురోహితులు, పెద్దలు, బంధువులను సంప్రదించి ఆయన నిర్ణయిస్తారు. దానికి నేను కట్టుబడతాను. అందువల్ల మా తండ్రి గారికి కబురు పంపండి' అన్నాడు. కబురందుకుని దశరథ మహారాజు వచ్చారు.

'నేను స్వయంవరం ఏర్పాటు చేస్తే భూమండలంలోని రాజులందరూ వచ్చిపోటీపడ్డారు. కానీ మీ రాముడు మాత్రమే శివధనుర్భంగం చేయగలిగాడు. ముందు చెప్పిన షరతు ప్రకారం నా కుమార్తెని ఇస్తున్నా. మీ కోడలిగా స్వీకరించండి' అని జనకుడు కోరాడు. దశరథుడు వెంటనే



ఎగిరి గంతేసి అంగీకరించలేదు. ఆయన అన్నాడు కదా...'ఈమె నా ఇంటి కోడలిగా రావడానికి ముందు మన రెండు వంశాలు సరిపోతాయా.. దానికి అర్హతలు మనకున్నాయా..'' అంటూ మరో గొప్పమాటంటాడు..

''రాముడు గొప్పవాడు ... పిల్లనివ్వడం మా అదృష్టం '' అంటూ వంగి మాట్లాడకండి, జనక మహారాజా! మీరు పిల్లనిస్తేనే కదా మా వంశం నిలబడేది. అప్పుడే కదా రుణ విమోచనం. ఇచ్చేవారు మీరు, పుచ్చుకునేవాడిని నేను. ఇప్పుడు వినయంగా ఉండాల్సింది నేను మహారాజా !'' అన్నాడు. ఆ తరువాత దశరథ మహారాజు కోరికపై వశిష్ఠుడు, జనకుడి కోరికపై వారి పురోహితుడు వారి వారి వంశాలను వివరించారు. అలా ఒకరి నుంచి మరొకరు క్షుణ్ణంగా తెలుసుకుని నిర్ణయించిన వివాహాలు కాలంలో ఆదర్శంగా నిలిచిపోయాయి. అందుకే గృహస్థాశ్రమానికి రామాయణం ఆదర్శం – అని కంచి మహాస్వామి అంటూండేవారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

డబుల్ యాక్షన్



రామ్

హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' (2019) మూవీ సూపర్ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. తాజాగా వీరి కాంబినేషన్‌లో 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' మూవీ రూపొందుతోంది. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలకపాత్రలో నటిస్తున్నారు. పాన్ ఇండియా చిత్రంగా రూపొందుతున్న 'డబుల్ ఇస్మార్ట్' నుంచి ఓ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ నెల 15న రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించి, రామ్ సరికొత్త పోస్టర్ విడుదల చేశారు. ఫేస్ మాస్క్, పులి చారల చొక్కా, టోర్న్ జీన్స్ ధరించి ఒక చేతిలో సిగరెట్, మరో చేతిలో క్రాకర్స్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌తో కనిపించారు రామ్. ''డబుల్ ఇస్మార్ట్' లో డబుల్ యాక్షన్, డబుల్ మాస్, డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. ఈ హై-బడ్జెట్ ఎంటర్‌టైనర్ మూవీ షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతోంది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సీఈఓ: విషు రెడ్డి, సంగీతం: మణిశర్మ, కెమెరా: సామ్ కె. నాయుడు, జియాని జియాన్నెలి.

నేనేం క్రికెట్ కోసం పుట్టలేదు!



జాన్వీ, రాజ్‌కుమార్ రావు



జాన్వీ కపూర్

రాజ్‌కుమార్ రావు, జాన్వీ కపూర్ జంటగా నటించిన హిందీ చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ మూవీకి శరణ్ శర్మ దర్శకుడు. ఈ సినిమాలో మహేంద్ర పాత్రలో రాజ్‌కుమార్ రావు, మహిమ పాత్రలో జాన్వీ కపూర్ నటించారని బాలీవుడ్ సమాచారం. జీ స్టూడియోస్, కరణ్ జోహార్, యశ్ జోహార్, అపూర్వ మెహతా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'నాకు ఇంకో ఏడాది అవకాశం కల్పించండి నాన్న.. నేను కచ్చితంగా సెలక్ట్ అవుతాను.. నా కలను బ్రేక్ చేయవద్దు నాన్న.. ప్లీజ్', 'మీ నాన్న కోసం నువ్వు (జాన్వీని ఉద్దేశిస్తూ..) డాక్టర్ అయ్యావు మహి.. కానీ నువ్వు ఏం కావాలనుకుంటున్నావు' (రాజ్‌కుమార్ రావు), 'నేనేం క్రికెట్ కోసం పుట్టలేదు' (జాన్వీ కపూర్) వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. క్రికెటర్ కావాలనుకున్న ఓ యువకుడు తన లక్ష్యాన్ని సాధించలేకపోతాడు. ఆ తర్వాత అతను పెళ్లి చేసుకుంటాడు. వృత్తి రీత్యా డాక్టర్ అయిన తన భార్యలో క్రికెట్ ప్రతిభ ఉందని గ్రహించి, తన భార్యకు తానే క్రికెట్ కోచింగ్ ఇచ్చి, ఆమెను ప్రోత్సహించి క్రికెటర్‌ను చేయాలనుకుంటాడు. ఈ నేపథ్యంలో ఆ భార్యాభర్తల జీవితాల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి? అనే నేపథ్యంలో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' సినిమా కథనం ఉంటుందని బాలీవుడ్ టాక్.

హాలీవుడ్ కింగ్ ఆఫ్ కల్ట్ రోజర్ కన్నుమూత



హాలీవుడ్‌కి చెందిన ప్రముఖ దర్శక-నిర్మాత, నటుడు రోజర్ విలియం కోర్మన్ (98) కన్నుమూశారు. 1926 ఏప్రిల్ 5న డెట్రాయిట్‌లో జన్మించారు రోజర్ కోర్మన్. కాలిఫోర్నియాలోని శాంటా మోనికాలో ఈ నెల 9న ఆయన మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని ధృవీకరించినట్లు హాలీవుడ్ మీడియా చెబుతోంది. దీంతో కాస్త ఆలస్యంగా ఆయన మరణవార్త వెలుగులోకి వచ్చింది. 1950లో స్టోరీ రీడర్‌గా ఆయన సినీ కెరీర్ మొదలైంది. కెరీర్ మొదట్లో ఒడిదొడుకులు ఎదుర్కొన్న తర్వాత రోజర్ కోర్మన్ తొలిసారిగా 'మాన్‌స్టర్ ఫ్రమ్ ది ఓషియన్ ఫ్లోర్' అనే ఓ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ నిర్మించగా మంచి విజయం సాధించింది. రోజర్ 50కిపైగా సినిమాలకు దర్శకత్వం వహించారు. 350కిపైగా సినిమాలను నిర్మించారు. అలాగే 20కి పైగా సినిమాల్లో నటించారు. దాదాపు 30 సినిమాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గానూ చేశారు. రోజర్ కెరీర్‌లో 'ఫైవ్ గన్స్ వెస్ట్', 'డే ది వరల్డ్ ఎండెడ్', 'ది అన్‌డెడ్', 'టార్గెట్స్', 'వార్ ఆఫ్ ది శాటిలైట్స్', 'ఎక్స్: ద మ్యాన్ విత్ ది ఎక్స్ రే ఐస్', 'డెత్ రేస్' వంటి ఎన్నో హిట్ సినిమాలున్నాయి. హాలీవుడ్ పరిశ్రమ రోజర్‌ను 'పోప్ ఆఫ్ పాప్ సినిమా', 'ది కింగ్ ఆఫ్ కల్ట్' వంటి పేర్లతో పిలుచుకుంటుంది. రోజర్‌కు భార్య జూలీ కోర్మన్, కుమార్తెలు కేథరీన్, మేరీ ఉన్నారు. ఆయన మృతిపట్ల హాలీవుడ్ సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

భావోద్వేగాల అమ్మ



శ్వేత

మదర్ సెంటిమెంట్, భావోద్వేగాలతో రూపుదిద్దుకోనున్న సరికొత్త థ్రిల్లర్ మూవీ 'అమ్మ'. ఆర్జే శ్వేత పీవీఎస్‌ను దర్శకురాలిగా పరిచయం చేస్తూ, యష్ రంగినేని ఈ సినిమాను నిర్మించనున్నారు. ఆదివారం (మే 12) మదర్స్ డే. ఈ సందర్భంగా 'అమ్మ' సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'అమ్మ' సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నామని చిత్ర యూనిట్ పేర్కొంది.

సింగిల్ షెడ్యూల్‌తో..



త్రివిక్రమరావు

కేవలం 20 లక్షల రూపాయలతో సింగిల్ షెడ్యూల్‌తో రూపొందిన చిత్రం 'అక్కడ వారు ఇక్కడ ఉన్నారు'. తెనాలికి చెందిన కుందుర్తి త్రివిక్రమరావు స్వీయ దర్శకత్వంలో తీశారు. సాయి హర్షిణి, ఎస్పీ రమణ, కేవీ రమణ, పి. లలిత వంటి నూతన తారలు నటించిన ఈ మూవీ ఈ నెల 17న విడుదలవుతోంది. కుందుర్తి త్రివిక్రమరావు మాట్లాడుతూ–''ఇప్పట్లో సినిమా నిర్మించడమంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నది. కానీ, కేవలం 20 లక్షల రూపాయలతో పది రోజుల సింగిల్ షెడ్యూల్‌లో మా చిత్రం పూర్తి చేశాం. అయితే క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడలేదు'' అన్నారు.

నన్ను పెళ్లి చేసుకుంటావా? అన్నాడు

– తాన్యా రవిచంద్రన్



''నన్ను పెళ్లి చేసుకుంటావా అక్కా?' అంటూ ఓ అభిమాని నన్ను అడిగాడు. అతడి ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు'' అన్నారు హీరోయిన్ తాన్యా రవిచంద్రన్. 2017లో విడుదలైన 'పాలే విల్లియతేవా' అనే తమిళ మూవీతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారామె. ఆ తర్వాత వరుసగా తమిళ చిత్రాల్లో చాన్స్‌లు అందుకున్నారు. కార్తికేయ హీరోగా నటించిన 'రాజా విక్రమార్క' (2021) చిత్రం ద్వారా తెలుగు పరిశ్రమకు పరిచయమయ్యారు తాన్యా రవిచంద్రన్. ఆ తర్వాత చిరంజీవి హీరోగా నటించిన 'గాడ్ ఫాదర్' చిత్రంలో హీరోయిన్ నయనతార చెల్లెలు పాత్ర ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు తాన్య. కాగా ఆమె హీరోయిన్‌గా నటించిన తాజా తమిళ చిత్రం 'రసవాది'. అర్జున్ దాస్ హీరోగా నటించిన ఈ చిత్రానికి శాంతకుమార్ దర్శకత్వం వహించారు. ఈ మూవీ శుక్రవారం(మే 10) విడుదలైంది. కాగా ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాన్యా రవిచంద్రన్ ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. ''ఇటీవల నా అభిమానులతో సమావేశమయ్యాను. ఆ సమయంలో ఓ అభిమాని 'నన్ను పెళ్లి చేసుకుంటావా అక్కా?' అని అడగడంతో అవాక్కయ్యాను. అక్క, పెళ్లి అంటూ రెండూ సంబంధం లేకుండా మాట్లాడాడు. ఆ సమయంలో అతడి ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో నాకు అర్థం కాలేదు. ఆ ఘటన గుర్తుకొస్తే ఇప్పటికీ నవ్వొస్తుంది'' అని తాన్యా రవిచంద్రన్ చెప్పారు.

క్రైమ్ థ్రిల్లర్



పాయల్ రాజ్‌పుత్

ఓ పోలీసాఫీసర్ జీవితంలో జరిగిన ఒక ఘటన స్ఫూర్తితో తెరకెక్కిన క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ 'రక్షణ'. హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాలో రోషన్, మానస్, రాజీవ్ కనకాల, వినోద్ బాల ఇతర పాత్రలు చేశారు. ప్రణదీప్ ఠాకోర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ''ఓ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ మిస్టరీ డ్రామాగా రూపొందిన చిత్రం 'రక్షణ'. ఈ మూవీలో తొలిసారి పోలీసాఫీసర్‌గా నటించారు పాయల్ రాజ్‌పుత్. త్వరలోనే ఈ సినిమా విడుదల వివరాలు వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: అనిల్ బండారి.

అన్నాచెల్లి అనుబంధం



పవిత్ర, రామ్

రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'చిట్టి పొట్టి'. భాస్కర గ్రూప్ ఆఫ్ మీడియా బ్యానర్‌పై భాస్కర్ యాదవ్ దాసరి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ మూవీ మోషన్ పోస్టర్‌ని రిలీజ్ చేసిన అనంతరం భాస్కర్ యాదవ్ దాసరి మాట్లాడుతూ–''అన్నాచెల్లి అనుబంధంతో నడిచే ఈ సినిమాలో భావోద్వేగాలు, తెలుగుదనం అనురాగాలు, ఆప్యాయతలు ఉంటాయి. ప్రతి ఇంట్లో ఉండే మహిళల విలువ తెలియజేసే సినిమా ఇది. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ వెంకట్, కెమెరా: మల్హర్‌భట్ జోషి.

సాక్షి హనుమకొండ

సోమవారం । 13 । మే । 2024

1



వైభవంగా కల్యాణ మహోత్సవం

శాయంపేట మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి, శివమార్కండేయ ఆలయంలో కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. - 2లో▸



ఈదురుగాలులతో భారీ వర్షం

ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో నడికూడ మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. - 2లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $37^0/26^0$

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి సమయంలో ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

నైటింగేల్ స్ఫూర్తితో వైద్య సేవలందించాలి



ఎంజీఎం: ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆశయాల స్ఫూర్తితో రోగులకు వైద్య సేవలదించాలని ఎంజీఎం ఆస్పత్రి రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఎంజీఎంలోని నర్సింగ్ వసతి గృహం ఆవరణలోని ఫ్లోరెన్స్ నైటింగేల్ మాత విగ్రహం వద్ద ఆస్పత్రి గ్రేడ్ -1 నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, గ్రేడ్ -2 నర్సింగ్ సూపరింటెండెంట్ రమాదేవి ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శ్రీనివాస్ ముందుగా నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి చాలా పవిత్రమైనదని, ఆస్పత్రికి వచ్చే వారితో సేవాభావంతో మెలిగి మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బేబీ సరళ, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆరాధనోత్సవాలు



హన్మకొండ కల్చరల్: శ్రీమత్ భగవద్రామానుజాచార్యులు, శ్రీభగవత్ ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని ఆదివారం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో ఆరాధనోత్సవాలు నిర్వహించారు. బ్రాహ్మణసేవా సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాహ్మణులు,శ్రీవైష్ణవులు ఆచార్యుల వారి చిత్రపటాలను అలంకరించి పూజలు చేసిన అనంతరం ఆలయం నుంచి రాగన్న దర్వాజ చిన్నకొవెల వరకు పాదయాత్రతో ఊరేగింపు నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు అందించిన మామిడిపండ్లను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగిళ్ల షణ్ముఖఅవధాని, లంకాశివకుమారఫణిశర్మ, రాకేశ్ శర్మ, గంగు మణికంఠశర్మ, మేఘనాథాచార్యులు, వెంకటరమణాచార్యులు, శ్రీవర్ధనాచార్యులు, రఘుకిరణాచార్యులు, తనుగుల రత్నాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కొండా మురళిని కలిసిన చిరువ్యాపారులు



వరంగల్ చౌరస్తా: వరంగల్ మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత కొండా మురళీధర్‌రావును ఆదివారం గ్రేటర్ వరంగల్ చిరువ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గజ్జెల లింగమూర్తి నేతృత్వంలో చిరువ్యాపారులు మర్యాదపూర్వకంగా కలిశారు. చిరువ్యాపారులు నిత్యం రహదారిపై ఎదుర్కొంటున్న ఇబ్బందులను మురళీధర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పోలీస్, నగర పాలక సంస్థ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు. కార్యక్రమంలో చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రితో బయల్దేరిన సిబ్బంది





కేటాయించిన బస్సులో ఎక్కుతున్న పోలింగ్ సిబ్బంది



హనుమకొండ తేజస్వి స్కూల్ పోలింగ్ కేంద్రంలో సిబ్బంది



నేడే ఓటరు తీర్పు

పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాలకు చేరిన అధికారులు, ఈవీఎంలు
- వరంగల్ లోక్‌సభ పరిధిలో 18.24 లక్షల మంది ఓటర్లు
- 1,900 పోలింగ్ కేంద్రాలు.. విధుల్లో 8,594 మంది అధికారులు, సిబ్బంది
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు ఓటింగ్
- భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
- బరిలో 42 మంది అభ్యర్థులు
- లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీస్ అధికారుల ప్రత్యేక దృష్టి

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024



ఏనుమాముల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

సాక్షిప్రతినిధి, వరంగల్: లోక్‌సభ సమరానికి రంగం సిద్ధమైంది. వరంగల్ పార్లమెంట్ స్థానానికి సోమవారం పోలింగ్ జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓటర్లు తమ తీర్పును ఈవీఎం యూనిట్ల ద్వారా వెల్లడించనున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం బాక్సుల్లో భద్రం కానుంది. తీర్పు ఏదైనా ఓటు హక్కు అందరూ వినియోగించుకునేలా అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇందుకు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధి 982 లొకేషన్లలో 1,900 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దివ్యాంగులు, వృద్ధులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వమే ప్రత్యేక వసతులు కల్పించి ఓటరు స్లిప్పులను అందించింది. సుమారు రెండు నెలలుగా కొనసాగుతున్న సుదీర్ఘ ప్రక్రియలో గతానికి భిన్నంగా ఈసారి ఎన్నికలను సజావుగా నిర్వహించాలని అధికారులు సంకల్పించి చర్యలు చేపట్టారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎన్నికల అధికారులు సిక్తాపట్నాయక్, రిజ్వాన్‌బాషా షేక్, భవేశ్‌మిశ్రా, సహాయ ఎన్నికల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. ఎన్నికల రోజు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించారు. భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరగనుండగా.. స్టేషన్ ఘన్‌పూర్(ఎస్సీ), వర్ధన్నపేట(ఎస్సీ), వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పాలకుర్తి, పరకాల నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందని అధికారులు ప్రకటించారు.

మహిళా ఓటర్లదే స్వల్ప ఆధిక్యం..

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో పురుషులు 8,95,421, మహిళలు 9,28,648, ఇతరులు 397 కలిపి మొత్తం 18,24,466 మంది ఈసారి తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో మహిళా ఓటర్లు స్వల్ప ఆధిక్యంలో ఉన్నారు. ఇదిలా ఉండగా.. 2,126 మంది ప్రిసైడింగ్, 2,126 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్, 4,342 మంది ఇతర ఎన్నికల అధికారులు కలిపి మొత్తం 8,594 మంది ఎన్నికల నిర్వహణ కోసం పని చేస్తున్నారు. మరో రెండువేలకు పైగా అధికారులు, సిబ్బందిని రిజర్వులో పెట్టినట్లు అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది..

వరంగల్ పార్లమెంట్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), వీవీప్యాట్‌లు, పోలింగ్ సామగ్రితో అధికారులు, సిబ్బంది ఆదివారం రాత్రే చేరుకున్నారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ ద్వారా ఆదివారం ఉదయం నుంచే పోలింగ్ సామగ్రితో అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు భారీ భద్రత నడుమ చేరుకున్నారు.

బరిలో 42 మంది అభ్యర్థులు

వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి మొత్తం 42 మంది బరిలో ఉండగా.. తాజా పరిస్థితులను బట్టి మూడు పార్టీల అభ్యర్థుల మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. టికెట్ల ఖరారు, నామినేషన్ల నుంచే బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల అభ్యర్థులు ప్రచారం సాగించారు. అరూరి రమేశ్ (బీజేపీ), డాక్టర్ కడియం కావ్య (కాంగ్రెస్), డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్ (బీఆర్‌ఎస్) మధ్యన ప్రధాన పోటీ నెలకొంది. కాగా సోమవారం పోలింగ్ జరగనుండగా... జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది.





సమస్యాత్మక కేంద్రాల్లో గట్టి భద్రత..

మొత్తం 1900 పోలింగ్ కేంద్రాల్లో 247 సమస్యాత్మకమైనవిగా గుర్తించిన అధికారులు అక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. 1309 పోలింగ్ కేంద్రాలలో లైవ్ వెబ్‌కాస్టింగ్, 397 పోలింగ్ కేంద్రాల బయట సీసీటీవీ కవరేజ్, 497 మైక్రో అబ్జర్వర్లతోపాటు భద్రతా సిబ్బందిని అధిక సంఖ్యలో కేటాయించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కట్టుదిట్టమైన భద్రతతో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలకు తరలించి భద్రపర్చే వరకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నికల్లో 3,200 మంది పోలీసులు, ఏడు కంపెనీల కేంద్ర బలగాలు పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నాయి.



వరంగల్ పార్లమెంట్‌లో ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు

మొత్తం ఓటర్లు	:	18,24,466
పురుష ఓటర్లు	:	8,95,421
మహిళా ఓటర్లు	:	9,28,648
ఇతర ఓటర్లు	:	397
పోలింగ్ కేంద్రాలు	:	1,900

పోలింగ్ ప్రక్రియకు పకడ్బందీ చర్యలు

ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పంపిణీ ప్రశాంతం

- ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
- వరంగల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య



డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్: వరంగల్ లోక్‌సభ స్థానానికి సోమవారం జరుగుతున్న పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఏనుమాముల మార్కెట్ యార్డ్‌లో చేపట్టిన ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్‌తో కలిసి ఆదివారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి వరంగల్ జిల్లాలోని వరంగల్ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 230 పోలింగ్ కేంద్రాలకు 21 రూట్లలో, వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్లలోని 279 పోలింగ్ కేంద్రాలకు 37 రూట్లలో సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని సెక్టోరియల్ అధికారుల పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ప్రతి బస్సుకు పోలీసుల వాహనాలు ఎస్కార్ట్‌గా వెళ్లాయన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామన్నారు. పోలింగ్ శాతం అధికంగా నమోదయ్యేలా ఓటు ప్రాముఖ్యంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ఆశించిన విధంగా అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. వరంగల్ తూర్పు, వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్ల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పంపిణీ, ఏర్పాట్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఏఆర్‌ఓలు అశ్విని తానాజీ వాకడే, సిదం దత్తు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, విజయ్‌సాగర్‌తో పాటు రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ లోక్‌సభ పరిధిలో పోలింగ్ కేంద్రాలు, పురుష, మహిళ, ఇతర, మొత్తం ఓటర్ల వివరాలు

అసెంబ్లీ సెగ్మెంట్	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
స్టేషన్‌ఘన్‌పూర్	295	1,25,210	1,28,898	02	2,54,110
పాలకుర్తి	296	1,26,411	1,29,090	13	2,55,514
పరకాల	239	1,08,076	1,14,305	02	2,22,383
వరంగల్ పశ్చిమ	244	1,39,322	1,44,108	16	2,83,446
వరంగల్ తూర్పు	230	1,25,638	1,32,518	339	2,58,495
వర్ధన్నపేట	279	1,34,257	1,39,491	18	2,73,766
భూపాలపల్లి	317	1,36,507	1,40,238	07	2,76,752
మొత్తం	1900	8,95,421	9,28,648	397	18,24,466

వైభవంగా శ్రీభద్రకాళీభద్రేశ్వరుల కల్యాణోత్సవం

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భద్రకాళీభద్రేశ్వరుల కల్యాణోత్సవాన్ని ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం చతుస్థానార్చన, ఉత్సవబలి నిర్వహించారు. ఉదయం అమ్మవారిని దుర్గామాతగా అలంకరించి సింహవాహనంపై, సాయంత్రం లక్ష్మీదేవిగా అలంకరించి గజవాహనంపై ఊరేగించారు. ఎస్ఎస్‌కే సేవా సమాజ్ వారు పూజా కార్యక్రమాలకు ఉభయదాతలుగా వ్యవహరించారు. కరీంనగర్‌కు చెందిన ప్రముఖ అద్వైత వేదాంతశాస్త్ర పండితులు మంగళంపల్లి వేణుగోపాలశర్మ శివకల్యాణ వైభవంపై పురాణ ప్రవచనం చేశారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సమాజ్ అధ్యక్షులు డాక్టర్ విశ్వనాథ్ దీపక్‌కోధన్, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



భద్రకాళీభద్రేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



వేడుకకు హాజరైన భక్తులు

నగరంలో కుండపోత



హనుమకొండ బస్టాండ్ వద్ద జలమయమైన రోడ్డు



కాశిబుగ్గ జంక్షన్ మున్సిపల్ కాంప్లెక్స్ ఎదుట..



హయగ్రీవాచారి గ్రౌండ్ ఎదుట..



హనుమకొండ ఇండోర్ స్టేడియం ఎదుట..



కాకాజీ కాలనీ రోడ్డులో..

వరంగల్ నగరంలో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. గాలి దుమారం, పిడుగులతో కూడిన వాన సుమారు రెండున్నర గంటల పాటు ఏకధాటిగా కురిసింది. తదుపరి తేలిక పాటు జల్లులు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. దీంతో వరద నీరు పోటెత్తి ప్రధాన రహదారులు, జంక్షన్లు, డ్రెయినేజీల్లో వరద ప్రవహించింది. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీటి కారణంగా వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు గాయాల పాలయ్యారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నగరం చాలా సమయం వరకు అంధకారంగా మారింది. - వరంగల్ అర్బన్/ఖిలావరంగల్

ఏడాదిగా ఇన్‌చార్జ్ పాలనే..

- హనుమకొండ సీడీపీఓ, జిల్లా ఇన్‌చార్జ్ అధికారిగా ఒక్కరే..
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ద్విపాత్రాభినయం
- అంగన్వాడీలపై కొరవడిన పర్యవేక్షణ

కాజీపేట అర్బన్: స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో పూర్తి స్థాయి జిల్లా అధికారి లేక ఏడాదిగా ఇన్‌చార్జ్ అధికారితోనే పాలన కొనసాగుతోంది. గతేడాది మే నెలలో అప్పటి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి సబిత పదోన్నతిపై భద్రాచలానికి బదిలీ అయ్యారు. నాటి నుంచి ఇన్‌చార్జ్ అధికారితోనే నడిపిస్తుండడంతో జిల్లా పరిధి మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లోని 798 అంగన్వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడింది. స్త్రీలు, శిశువులు, వృద్ధులు, దివ్యాంగులకు సంక్షేమ పథకాల అమలులో ఆ శాఖ ఉద్యోగుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది.

ద్విపాత్రాభినయం..

ఏడాది క్రితం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి సబిత బదిలీపై వెళ్లిన నాటి నుంచి హనుమకొండ సీడీపీఓగా విధులు నిర్వహిస్తున్న మధురిమ జిల్లా ఇన్‌చార్జ్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా.. హనుమకొండ సీడీపీఓ పరిధి 323 అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణతోపాటు నిత్యం కలెక్టరేట్, జిల్లా అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉండాల్సిన పరిస్థితి. దీంతో రెండు బాధ్యతల నిర్వహణ కత్తిమీద సాములా మారింది. అంతే కాకుండా 'బేటి బచావో- బేటి పడావో, చైల్డ్‌లైన్, సఖి సెంటర్, శిశు గృహ, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు, దివ్యాంగుల సంక్షేమ పథకాలు వంటి కార్యక్రమాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. అలాగే శాఖలోని ఉద్యోగులపై పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హనుమకొండ జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులు, వాటి పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల వివరాలు ఇలా..

ఐసీడీఎస్ కేంద్రాలు		
హనుమకొండ	:	323
భీమదేవరపల్లి	:	237
పరకాల	:	238
ప్రీ స్కూల్ చిన్నారులు	:	6,813
మూడేళ్లలోపు చిన్నారులు	:	21,065
గర్భిణులు	:	4,053
బాలింతలు	:	3,946



జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి మధురిమ

ఎన్నికల ఎఫెక్ట్..

గతేడాది జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి సబిత బదిలీ అయిన నాటి నుంచి హనుమకొండ సీడీపీఓ ఇన్‌చార్జ్ అధికారి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. నేడు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లాకు పూర్తి స్థాయి సంక్షేమ అధికారిని ఉన్నతాధికారులు నియమించలేకపోయారు. పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే పూర్తి స్థాయి జిల్లా అధికారిని నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కృష్ణయ్యపై దాడిని ఖండించాలి

కాజీపేట: వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని ఆకాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ తెలిపారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తిలో ప్రచారంలో ఉన్న కృష్ణయ్యపై దాడి చేసిన దుండగులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతోనే వైఎస్సార్ సీపీ అభ్యర్థులపై దాడులకు తెగబడుతున్న వారిని శిక్షించాలని విజ్ఞప్తి చేశారు.

శ్వేతార్కలో పుత్రకామేష్టి యాగం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఆదివారం పుత్ర కామేష్టి యాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయిన వోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక యాగశాలలో పుత్రకామేష్టి యాగం చేశారు. పిల్లలు కావాలని ఆకాంక్షిస్తూ దాదాపు వంద జంటలు యాగంలో పాల్గొన్నాయి. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య పాయసం వండి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం దేవాలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ, ఆలయ ఇన్‌చార్జ్ చొక్కారపు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు శర్మ పాల్గొన్నారు.

క్షుద్ర పూజల కలకలం

నడికూడ : మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు మూఢనమ్మకాలపై పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ జనాల్లో మార్పు రావడం లేదు. మండలంలోని రామకృష్ణపూర్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం క్షుద్ర పూజలు చేసి, జంతుబలి ఇవ్వడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు, కూలీలు భయంతో వణికిపోతున్నట్లు తెలిపారు. కాగా గతంలో కూడా కూడలి వద్ద, అమావాస్య రోజు తరుచుగా గ్రామాల్లో క్షుద్ర పూజలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా క్షుద్ర పూజలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

'ప్రయోజకులను చేసేందుకు తల్లి తాపత్రయం'

రామన్నపేట: పిల్లలు పుట్టినప్పటి నుంచి తల్లి అనేక ఆటుపోట్లను భరిస్తూ వారిని ఉన్నతులుగా తీర్చి ప్రయోజకులుగా చేసేందుకు అనేక త్యాగాలను చేస్తుందని రామన్నపేటలోని డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. మాతృదినోత్సవం సందర్భంగా నగరంలోని బ్యాంక్‌కాలనీలో నివాసం ఉంటున్న 85 ఏళ్ల వృద్ధురాలు బ్రహ్మదేవుల చంద్రకళను ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు తల్లితో ఎక్కువ అనుబంధం ఉంటుందని అన్నారు. నేటి తరం పిల్లలు వారి తల్లిదండ్రులను వృద్ధాశ్రమం, అనాథాశ్రమంలో చేర్పిస్తూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



ఎల్కతుర్తి: ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వస్తున్న సిబ్బంది



దామెరలో మహిళా పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల సిబ్బంది



ఎల్కతుర్తి: భీమదేవరపల్లిలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- ఆయా కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో నేడు ఓటింగ్

ఆత్మకూరు : పార్లమెంట్ ఎన్నికలకు మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఓటర్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. మండలంలో 24 ప్రాంతాల్లో 32 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.. మొత్తం 28,357 ఓటర్లు ఉండగా ఇందులో 13,768 పురుషులు, 14,589 స్త్రీలు ఉన్నారు. వీరు నేడు (సోమవారం)ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎన్నికల నియమావళి పాటించాలని సీఐ క్రాంతికుమార్ కోరారు.

సర్వం సిద్ధం

శాయంపేట : మండలంలోని 24 గ్రామాల్లో 42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా అధికారులు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ కొనసాగించనున్నారు. నేడు(సోమవారం) జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం పోలింగ్ సిబ్బంది ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు రూట్ ఆఫీసర్లు పర్యవేక్షణలో చేరుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు పోలింగ్ సిబ్బందికి తాగునీరు, టీ, స్నాక్స్ అందించారు. భోజన వసతి కూడా సమకూర్చుతున్నట్లు తెలిపారు.

కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

ఎల్కతుర్తి : నేడు(సోమవారం) పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది చేరుకోవడంతో వారికి కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలను మండల అధికారులు ఏర్పాటు చేశారు. భీమదేవరపల్లి మండలంలో మొత్తం 46 పోలింగ్ కేంద్రాలకు నలుగురు ప్రత్యేక ఎన్నికల అధికారులు, 184మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరేశం తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి వసతి, టెంట్లు, భోజన వసతి, లైటింగ్ సదుపాయం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే ముల్కనూర్, వంగర పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 96మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు ఎస్సైలు సాయిబాబు, వెంకటేశ్వర్లు చెప్పారు.



ఎల్కతుర్తి: వంగర పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలీసులు, ఎన్నికల సిబ్బంది



ఐనవోలు: పర్యవేక్షిస్తున్న ఎస్సై అనిల్‌కుమార్



శాయంపేట: పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

అలాగే ఎల్కతుర్తి మండల పరిధిలో మొత్తం 39 పోలింగ్ కేంద్రాలకు నలుగురు ప్రత్యేక ఎన్నికల అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మొత్తం పోలింగ్ బూతుల్లో 41మంది సిబ్బంది పాల్గొననున్నట్లు వెల్లడించారు.

పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కమలాపూర్ : మండలంలో మొత్తం 65 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా పురుష ఓటర్లు 26,411, మహిళా ఓటర్లు 27,917 కలుపుకుని మొత్తం 54,328 మంది ఉన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్ల కోసం టెంట్లు, తాగునీటి సౌకర్యాలతో పాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం ఆదివారం సాయంత్రమే పోలింగ్ సిబ్బంది ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఇతర ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు చేరుకున్నారు.

నడికూడలో..

నడికూడ : మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించే పార్లమెంట్ ఎన్నికలకు ఆయా పోలింగ్ కేంద్రాలకు రిటర్నింగ్ అధికారులు, ఇతర సిబ్బంది ఆదివారం ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. మండల కేంద్రంలోని 33వ పోలింగ్ కేంద్రాన్ని మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే మండలంలోని చర్లపల్లి మోడల్ పోలింగ్ స్టేషన్‌ను తహసీల్దార్ గుండాల నాగరాజు పరకాల సీఐ రవిరాజు సందర్శించారు.

వేలేరులో..

వేలేరు : పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఆదివారం తెలిపారు. మండలంలో ఆయా గ్రామాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

దామెరలో..

దామెర : నేడు(సోమవారం) జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి తెలిపారు. పోలింగ్ సిబ్బంది ఈవీఎంలతో ఆదివారం మధ్యాహ్నం ఆయా పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 118వ పోలింగ్ బూత్‌ను మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ బూత్‌లో మొత్తం 1,016 ఓటర్లు ఉండగా ఇందులో 543 మంది మహిళలు, 473 మంది పురుషులు ఉన్నారు. ఈ పోలింగ్ బూత్‌లో మహిళలు మాత్రమే ఎన్నికల విధులు నిర్వహించడం విశేషం. అదేవిధంగా మండలంలోని ఊరుగొండలో 110వ పోలింగ్ బూత్‌ను యువకుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ బూత్‌లో మొత్తం 954 ఓటర్లు ఉండగా ఇందులో 440 మంది పురుషులు, 514 మంది మహిళలు ఉన్నారు. 30 సంవత్సరాలలోపు యువ ఉద్యోగులు ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహించడం ప్రత్యేకం. కాగా ప్రత్యేంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను ఓటర్లను ఆకర్షించే విధంగా అందంగా అలంకరించారు. అయితే ఈ పోలింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా పరిశీలించారు. మండలవ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని టెంట్లు, తాగునీటి వసతి, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. మండల కేంద్రంలోని 118 పోలింగ్ బూత్‌ను డీఆర్డీఏ ఏపీడీ శ్రీనివాసరావు, డీడబ్ల్యూఓ మధురిమ, సెక్టార్ అధికారి చేతన్‌కుమార్ రెడ్డి పరిశీలించగా వారి వెంట పంచాయతీ కార్యదర్శి నరేష్, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.



ఐనవోలు: పోలింగ్ కేంద్రానికి వస్తున్న అధికారులు



వేలేరు: పోలింగ్ కేంద్రం వద్ద..

ఐనవోలులో..

ఐనవోలు : నేడు(సోమవారం) జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి మండలంలో 41 బూత్‌లు ఉండగా ప్రతి బూత్‌కు ప్రిసైడింగ్ ఆఫీసర్, ఏపీఓ, సపోర్టింగ్ స్టాఫ్ ఇద్దరు, కానిస్టేబుల్ ఎన్నికల సామగ్రితో ఆదివారం సాయంత్రమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 41 బూత్‌ల్లో 36,121 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పురుష ఓటర్లు 17,699, మహిళ ఓటర్లు 18,421, ఇతర ఓటరు ఒకరు ఉన్నారు.



ఆత్మకూరు: పోలింగ్ కేంద్రానికి వస్తున్న సిబ్బంది



ఆత్మకూరులో ఏర్పాటు చేసిన మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రం



పరకాల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద..

పరకాలలో..

పరకాల : పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలో 71 పోలింగ్ బూత్‌లకు 119 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది సామగ్రితో చేరుకున్నారు. అయితే సాయంత్రం గాలిదుమారంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పటికి సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులోనే ఏర్పాట్లు చేసుకున్నారు. అదే విధంగా పరకాల మండలం పోచారం, నాగారం, పరకాల మున్సిపాలిటీ పరిధిలోని వెలమవాడ, బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాలు ఆకట్టుకున్నాయి.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పరకాల మున్సిపాలిటీ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఐఏఎస్ అధికారి బండారి స్వాగత్ రన్వీన్‌చంద్ తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఇబ్బంది పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. మోడల్ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.



నడికూడ: మహిళా పోలింగ్ కేంద్రం..



కమలాపూర్ : సామగ్రితో చేరుకున్న సిబ్బంది



శాయంపేట: పనుల్లో నిమగ్నమైన సిబ్బంది



శాయంపేట : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు



మడికొండ: వైశాఖ పంచమి, ఆరుద్ర నక్షత్రం, ఆదిశంకరాచార్య జయంతిని పురస్కరించుకొని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో మెట్టు రామలింగేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య స్వామివారికి ఆదివారం రుద్రాభిషేకం, లక్ష పుష్పార్చన చేశారు. కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

నడికూడ : మండలంలో ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండలవ్యాప్తంగా మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానిక రైతు వరిధాన్యంపై టార్పాలిన్ కప్పే క్రమంలో ఆకస్మికంగా ఈదురు గాలులు రావడంతో కింద పడ్డాడు. దీంతో అతని చేతికి గాయమైంది. స్థానికులు వైద్య చికిత్స కోసం పరకాలకు తరలించారు. కాగా పలు గ్రామాల్లో ఎన్నికల సిబ్బంది విద్యుత్ సరఫరా లేక, సెల్‌ఫోన్ వెలుతురులో ఎన్నికలకు ఏర్పాట్లు చేశారు.

ఉరుములతో కూడిన భారీ వర్షం

చీకట్లో ఇబ్బంది పడుతున్న పోలింగ్ సిబ్బంది

శాయంపేట : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులతో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. పోలింగ్ విధులకు వచ్చిన సిబ్బంది చీకట్లో ఇబ్బందులకు గురయ్యారు. భారీ వర్షానికి అటు అన్నదాతలు, ఇటు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సుమారు గంటన్నర సేపు కురిసిన వర్షానికి శాయంపేటలోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసుకున్న ధాన్యంపై కప్పిన టార్పాలిన్ కవర్లు గాలి దుమారానికి కొట్టుకుపోగా వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. మాజీ వార్డు సభ్యుడు బాసాని చంద్రమౌళి ఇంటి సమీపంలో సైడ్ కాల్వ పూర్తిగా కూరుకుపోవడంతో వరద నీరు ఇంట్లోకి చేరి కిరాణ సామాన్లు పూర్తిగా తడిసిపాయాయి. దీంతో డివైడర్‌కు రంధ్రం చేసి వరద నీటిని మళ్లించారు. ఇంట్లోకి వరద నీరు చేరడంతో రూ.50వేల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.



శాయంపేటలో కురుస్తున్న భారీ వర్షం

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్

శాయంపేట : నేడు(సోమవారం) జరగనున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం ఎస్సై ప్రమోద్‌కుమార్ అధ్యక్షతన ఎన్నికల విధులలో పాల్గొంటున్న పోలీస్ సిబ్బందికి అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏసీపీ హాజరై మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఐదుగురికి మించి గుంపులుగా ఉండకుండా చూడాలని ఆదేశించారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా ఉండేందుకు బార్డర్ సెక్యూరిటీ పోలీస్ బలగాలతో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారాలు నిర్వహించకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీఐ రంజిత్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

వేలేరు : మండలంలోని మద్దెలగూడెం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి సంపత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం మండల అధ్యక్షుడు సంపత్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందజేస్తున్న ప్రజాపాలనకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మండల ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, నాయకులు మల్లికార్జున్, లక్ష్మణ్ నాయక్, మధుసూదన్, సంపత్, గ్రామశాఖ అధ్యక్షుడు రాజు, మనోజ్, రాజు తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

ఆహ్లాదకరంగా పచ్చని చెట్లు

- రహదారులను అల్లుకున్న పచ్చదనం

ఎల్కతుర్తి : పర్యావరణ పరిరక్షణకు అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చాయి. మండలంలోని వీరనారాయణపూర్ నుంచి దండెపల్లి, గుంటూపల్లి నుంచి తిమ్మాపూర్, కేశవాపూర్ వరకు, ఇందిరానగర్ నుంచి గోపాల్‌పూర్, కోతులనడుమ నుంచి జీల్గుల, జగన్నాథపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్లకిరువైపులా గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగా పచ్చనిహారంగా విలసిల్లుతోంది. ఇవి వాతావరణ ఎద్దడిని తట్టుకున్న మొక్కలు కావడంతో ప్రస్తుతం ఏపుగా పెరిగాయి. ఇటీవలే మండలంలో కురిసిన ఓ మోస్తారు వర్షానికి చెట్లన్ని పచ్చదనంతో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఆకుపచ్చ తోరణాన్ని తలపిస్తున్నాయి. అటుగా వెళ్లే బాటసారులకు, ప్రయాణికులకు నీడనందించడమే కాకుండా చల్లటి ఆహ్లాద వాతావరణాన్ని అందిస్తున్నాయి. వల్బాపూర్‌కు చెందిన ఓ రైతు తన వ్యవసాయ భూమిలో రోడ్డు పక్కన, పొలం గట్లపై నాటిన టేకు మొక్కలు సైతం ఏపుగా పెరిగి చల్లటి నీడనందిస్తుండడంతో బాటసారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేశవాపూర్, జగన్నాథపూర్, దండెపల్లికి వెళ్లే రహదారుల వెంబడి నాటిన కానుగ చెట్లు నీడనందించడమే కాకుండా వాటికి కాసిన కాయ గింజలు ఎండి బయోడీజిల్ తయారీకి ఎంతగానో ఉపయోగపడుతాయని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం అధికారులు హరితహారంలో ఎంత బాధ్యతగా మొక్కలను నాటుతున్నారో అంతే బాధ్యతగా వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్ తరాలకు ఈచెట్లు ఎంతగానో ఉపయోగ పడుతాయని పలువురు బాటసారులు పేర్కొంటున్నారు.



వల్బాపూర్ నుంచి దండెపల్లికి వెళ్లే రోడ్డుకిరువైపులా పచ్చదనం



కోతులనడుమ-వీరనారాయణపూర్ రహదారిలో..

వైభవంగా కల్యాణ మహోత్సవం

శాయంపేట : మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి, శివమార్కండేయ ఆలయంలో ఏకాదశ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం మూడో రోజు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భద్రకాళి దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి, పర్వత వర్ధని సమేత శివమార్కండేయ స్వామి, శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, పంచముఖ ఆంజనేయస్వామి, నాగదేవత విగ్రహాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూలమంత్ర హవనం, హోమాలు నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, పర్వత వర్ధని సమేత శివ మార్కండేయ స్వామి కల్యాణ మహోత్సవాలను వేద మంత్రోచ్చరణాల మధ్య అంగరంగ వైభవంగా చేపట్టారు. అనంతరం హైకోర్టు న్యాయవాది మామిడి రూపేందర్ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాష్, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్, తాటి రమేష్, చిందం కర్ణాకర్, గ్రామస్తులు వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, సదాశివుడు, చంద్రమౌళి, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


టేకుమట్ల: అంకుశాపూర్ పోలింగ్ స్టేషన్‌కు చేరిన ఎన్నికల సిబ్బంది


నర్సంపేట మార్కెట్ యార్డు నుంచి ఎన్నికల సామగ్రితో వెళ్తున్న సిబ్బంది


నెల్లికుదురు: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది


కురవి: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న అధికారులు


వరంగల్ ఏనుమాముల మార్కెట్ ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సిబ్బంది

పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

విధినిర్వహణకు సిద్ధం

పలుచోట్ల చీకట్లోనే సిబ్బంది

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం రాత్రి వరకు ఎన్నికల అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నేడు పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం సామగ్రిని కేటాయించిన చోటుకు చేర్చడం వరకు అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా.. ఆదివారం రాత్రి పలుచోట్ల వర్షం కురియడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో సిబ్బంది చీకట్లోనే భోజనాలు చేయడంతోపాటు పోలింగ్‌కు ముందస్తు పనులు చేసుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్


మంగపేట : బాలన్నగూడెం పోలింగ్ కేంద్రంలో సెల్ ఫోన్‌లైట్ వెలుగులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది


పర్వతగిరి:పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది


పర్వతగిరి: పోలింగ్ కేంద్రంలో బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది


వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది


కాటారం: మహదేవపూర్ పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది


చెన్నారావుపేట: జల్లి పోలింగ్ బూత్‌లో విధుల్లో పోలింగ్ సిబ్బంది

క్లుప్తంగా...

కేయూలో మెస్‌ల మూసివేత



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో అలుమనాక్ ప్రకారం ఈనెల 11నుంచి 31వ తేదీ వరకు పీజీ కోర్సుల విద్యార్థులు, అధ్యాపకులకు వేసవి సెలవులు కొనసాగనున్నాయి. అయితే విద్యార్థుల విజ్ఞప్తిమేరకు హాస్టళ్లను తెరిచే ఉంచుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం భోజనం తర్వాత మెస్‌లను మూసివేశారు. ఈనెల 14న మళ్లీ మెస్‌లను తెరిచే అవకాశం ఉంది. అయితే కామన్‌మెస్‌లో సుమారు 1000మంది వరకు విద్యార్థులు మెస్ కార్డులను కలిగి ఉన్నారు. అందులో కనీసం 250మంది విద్యార్థులు వస్తే కామన్‌మెస్‌ను, సుమారు 2వేల మంది విద్యార్థినులు మెస్ కార్డు కలిగి ఉన్న పద్మాక్షి మహిళా హాస్టల్స్‌లో కనీసం 300 మందికిపైగా వస్తేనే మెస్‌లను తెరుస్తామని కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య శ్రీనివాస్‌రావు స్పష్టం చేశారు.

వందేళ్ల నాటి బ్రిడ్జి కూల్చివేత


కాజీపేట జంక్షన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగిస్తున్న భారీ క్రేన్, సిబ్బంది

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో దాదాపు వందేళ్ల కిందటి నిజాం కాలం నాటి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని రైల్వే అధికారులు ఆదివారం తొలగించారు. 2022లో బల్లార్ష స్టేషన్‌లో పాత ఫుట్ ఓవర్ బ్రిడ్జి కూలిపోయిన ఘటనతో కాజీపేట జంక్షన్‌లోని పాత కాలం నాటి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని అధికారులు మూసేశారు. అప్పటి నుంచి ప్రయాణికులు ఈ బ్రిడ్జి గుండా అనుమతించలేదు. కాజీపేట స్టేషన్ రీ డెవలప్‌మెంట్‌లో భాగంగా దాదాపు ఏడాదిన్నర కాలం తర్వాత రైల్వే అధికారులు బ్రిడ్జి తొలగింపు పనులు చేపట్టారు. దాదాపు 2 గంటల పాటు రైల్వే బ్లాక్ తీసుకొని ఓహెచ్‌ఈ విద్యుత్ సరఫరా నిలిపేశారు. ఐరన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని రెండు వైపులా కట్ చేసి భారీ క్రేన్ సాయంతో తొలగించారు. దీంతో పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. తొలగించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి స్థానంలో త్వరలో.. కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు ర్యాంప్, ఎస్కలేటర్, లిఫ్ట్ నిర్మాణ పనుల్ని చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సికింద్రాబాద్, కాజీపేట రైల్వే అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు బోనాలు



కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని బ్రహ్మంగారితండాలో దుర్గమ్మ దేవాలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం మహిళలు నీళ్లబోనాలను అమ్మవారికి సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జలాభిషేకం చేశారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. బంధువులు, గ్రామస్తులు రోజంతా ఆనందంగా గడిపారు. పిల్లాపాపలను చల్లగాచూడాలని, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించేలా దీవించాలని దుర్గమ్మతల్లిని భక్తులు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, తండాపెద్దలు పాల్గొన్నారు.

అటకెక్కిన ఆక్సిజన్ పార్క్

- 'కుడా' ఆధ్వర్యంలో రూ.4 కోట్లతో పనులు ప్రారంభం
- 99 ఎకరాల్లో నిర్మాణానికి ప్రణాళిక
- ముందుకు సాగని పనులు


ఆక్సిజన్ పార్క్ ముఖ ద్వారం దుస్థితి

మడికొండ: గ్రేటర్ వరంగల్ నగర ప్రజలతో పాటు, పర్యాటకుల్ని ఆకట్టుకునేలా ఆక్సిజన్ పార్కు ఏర్పాటు చేయాలనుకున్నారు. నగర పరిధి 46వ డివిజన్ రాంపూర్, స్టేషన్ పెండ్యాలలో 'కుడా' ఆధ్వర్యంలో ఈ పార్కు పనులు ప్రారంభించారు. సుమారు 99 ఎకరాల స్థలంలో నిర్మించతలపెట్టిన ఈ పార్కు గ్రేటర్‌కే తలమానికమని అప్పటి ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కానీ.. పనులు మొదలు పెట్టిన అనంతరం ప్రస్తుతం అడుగు ముందుకు పడని పరిస్థితి. అసలు ఆక్సిజన్ పార్క్ ఉన్నట్లా? లేనట్లా? అని ప్రజలు అనుమానం వ్యక్తం చేశారు.

పర్యాటకుల సౌకర్యార్థం

వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన నిర్మిస్తున్నందున అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. 99 ఎకరాల స్థలంలో ఇప్పటి వరకే 40 ఎకరాలున్న ఊర చెరువును అభివృద్ధి చేయడంతో పాటు, మిగతా స్థలంలో మియావాకీ, బ్లాక్ ప్లాంటేషన్, ఏర్పాటు చేశారు. పార్కు ఎంట్రెన్స్‌లో గేట్ వే నిర్మాణంతో పాటు చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ జిమ్, బటర్ ఫ్లై పార్కు నిర్మాణం చేయనున్నట్లు నాటి ప్రభుత్వంలో కూడా అధికారులు తెలిపారు. చెరువులో బోటింగ్, ఫిషింగ్, యాక్టివిటీ, పాత్ వే నిర్మాణం, ఫుడ్ కోర్టు వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం రహదారి పక్కన పార్కింగ్‌కు అనుకూలంగా తీర్చిదిద్దారు.

తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు

ఆక్సిజన్ పార్కులో మియావాకీ ఫారెస్ట్ ఏర్పాటు చేయాలని అప్పటి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు పెంచడమే మియావాకీ ప్రత్యేకత. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే ఈపార్కులో 20 వేల మొక్కలు నాటారు. అనంతరం వాటి నిర్వహణ మరిచారు.

పార్కుతో పాటు గ్రామాభివృద్ధి



పార్కు ఏర్పాటైతే మా ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఎంతో సంతోషించాం. కానీ నేడు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అసలు పార్కు అభివృద్ధి ఉన్నట్టా లేనట్టా అనేది అర్థమవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్కును అభివృద్ధి చేస్తారో లేదో చూడాలి. అధికారులు స్పందించాలి.

- అర్శనపెల్లి విజయ్‌రావు, రాంపూర్ గ్రామస్తుడు

నాడు బీఆర్‌ఎస్ ఆర్భాటం



నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 99 ఎకరాల స్థలంలో ఆక్సిజన్ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. 2017లో పనుల్ని ప్రారంభించింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. ఆక్సిజన్ పార్కుపై ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించాలి.

- మునిగాల డానియల్, స్థానికుడు

ఇక..ఈజీ రైల్వే టికెట్



కాజీపేటలో ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషన్, అన్ రిజర్వుడ్ టికెట్ సిస్టం సౌకర్యం

- ఏటీవీఎం, యూటీఎస్ యాప్‌లతో టికెట్ జారీ
- క్యూ ఆర్ కోడ్‌తోనూ సౌకర్యం
- క్యాష్‌లెస్‌తో స్మార్ట్‌ఫోన్లలో యాప్‌లు
- యాప్‌లపై ప్రయాణికులకు రైల్వే అవగాహన

కాజీపేట రూరల్: మారుతున్న కాలనికి అనుగుణంగా ఇండియన్ రైల్వే నూతన సాంకేతికాన్ని వినియోగిస్తోంది. ప్రయాణికులకు ఎప్పటికప్పుడు టెక్నాలజీని అప్‌డేట్ చేస్తూ రైల్వేసేవలు అందుబాటులోకి తీసుకువస్తోంది. దీంతో ప్రయాణికులు టెక్నాలజీని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటున్నారు. ప్రయాణికులు తాజాగా క్యాష్‌లెస్ ద్వారా స్మార్ట్ ఫోన్ యాప్‌లతో జనరల్, సీజన్, ప్లాట్‌ఫాం టికెట్లను తీసుకునే వెసులుబాటు కల్పించారు. కాజీపేట రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్‌లో ప్రయాణికులు జనరల్ టికెట్ తీసుకునేందుకు కౌంటర్‌లో క్యూఆర్ కోడ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి పెట్టారు. టికెట్ కావాల్సిన వారు లైన్లో నిల్చోకుండా ఆండ్రాయిడ్ మొబైల్‌లో క్యూఆర్ కోడ్ యాప్ డిస్‌ప్లే ద్వారా ఫోన్ పే చేసి స్పాట్ జనరల్. సీజన్, ప్లాట్‌ఫాం టికెట్ పొందవచ్చు


కాజీపేట జంక్షన్‌లో టికెట్ యాప్‌లపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

ఏటీవీఎంతో పేపర్‌లెస్ టికెట్

అదేవిధంగా టికెట్ బుకింగ్ కౌంటర్ కార్యాలయంలో ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషన్ (ఏటీవీఎం)లో నగదుతో గానీ లేదా ఫోన్ పే ద్వారా పేపర్ లెస్ టికెట్, పేపర్ టికెట్ పొందవచ్చు.

యూటీఎస్ యాప్‌తో..

అన్ రిజర్వుడ్ టికెట్ సిస్టం (యూటీఎస్) యాప్‌ను ఆండ్రాయిడ్ మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి, ఈ విధానంలో ప్రయాణికులు స్టేషన్‌కు వచ్చి లైన్ కట్టకుండా ఇంటి వద్ద నుంచి గానీ, లేదా రైల్వే స్టేషన్ వద్దకు వచ్చి రైలు ఎక్కుతూ గానీ, రైల్వే స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలో ఉండి యూటీఎస్ ద్వారా కావాల్సిన టికెట్ తీసుకోవచ్చు.

మంత్లీ రైల్వే టికెట్

ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లే సీజన్ టికెట్ ఓల్డర్స్‌కు సీజన్ టికెట్ ఇస్తున్నారు. ఇందుకు ప్రయాణికులు ఫోన్ పే యాప్ ద్వారా టికెట్లు పొందవచ్చు.

వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం ఏకగ్రీవం


చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గం

- హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఫలితాల ప్రకటన నిలిపివేత
- పాత కమిటీకే పట్టం

వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో పోటీదారులు ఎవరూ లేనందున ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తాబేటి శ్రీధర్ తెలిపారు. వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, వరంగల్ యొక్క 2023–26 (మూడేళ్ల కాల పరిమితి)కి గాను ఎన్నికలు నిర్వహించాలనుకున్నారు. ఆదివారం(ఈ నెల 12) వరకు ఉపసంహరణకు గడువు విధించారు. పోటీలో అన్ని పదవులకు అభ్యర్థులు తప్ప పోటీదారులు లేనందున ఏకగ్రీవమైన కార్యవర్గాన్ని ప్రకటించారు. చాంబర్ అధ్యక్షుడిగా బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మొగిళి చంద్రమౌళి, గౌరవ ప్రధాన కార్యదర్శిగా మడూరి వేదప్రకాశ్, సంయుక్త కార్యదర్శిగా సాగర్ల శ్రీనివాస్, కోశాధికారిగా అల్లె సంపత్, కార్యవర్గ సభ్యులుగా గాజుల సుమన్, కంచ సంతోశ్, గౌరిశెట్టి శ్రీనివాస్, కైలాస హరినాథ్, సూదాటి రాజేశ్వర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు సంబంధించిన కేసు హైకోర్టులో ఉన్నందున వీరి ఎన్నికను అధికారికంగా ప్రకటించలేకపోతున్నామని తాబేటి శ్రీధర్ తెలిపారు.

మళ్లీ పాత కార్యవర్గమే..

ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల్లో పోటీ చేసిన పాత కమిటీనే మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నామినేషన్లు వేసిన వారంతా ఉపసంహరించుకోవడంతో పాత కమిటీలో కంచె సంపత్ అనే కార్యవర్గ సభ్యుడు మినహా పాత కమిటీలోని వారే కొత్త కమిటీలో ఉన్నారు. కంచె సంపత్ స్థానంలో కంచె సంతోశ్ కొత్తగా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కు కేయూ జట్టు


కేయూ జట్టుతో స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ, తదితరులు

కేయూ క్యాంపస్ : బెంగుళూరు యూనివర్సిటీలో ఈనెల 13 నుంచి నిర్వహించే ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు సాఫ్ట్‌బాల్ (పురుషుల) కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వై.వెంకయ్య తెలిపారు. జట్టులో డి.దినేష్ బి.సర్దార్, ఆర్.అంకిత్(యూఏఎస్‌సీ సుబేదారి హనుమకొండ), ఎ.మనోజ్ ఎస్.అంజన్నా, బి.రాము(పీసీపీఈ బొల్లికుంట), ఎన్.తరుణ్, ఆర్.మేఘనాథ్(కిట్స్ వరంగల్) ఎ.రాజశేఖర్‌రెడ్డి, వై.శ్రీను, కె.ఆకాశ్, ఎం.కృష్ణమోహన్(యూసీపీఈ, కేయూ), ఎల్. కళ్యాణ్, ఎం.ఆకాష్(యూసీపీఈ ఖమ్మం), డి.డేనియల్(ఎంఎంఎస్ మంచిర్యాల), బి.మనీష్ (న్యూసైన్స్ డిగ్రీకాలేజీ హనుమకొండ) ఉన్నారు. జట్టు మేనేజర్‌గా ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫిజికల్ డైరెక్టర్ ఎ.రవి కుమార్ వ్యవహరిస్తున్నారని ఆయన ఆదివారం వివరించారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు


బీరకాయ తోట


పాలకూర తోట

- సరైన సమయంలో సాగు చేస్తే మార్కెట్‌లో మంచి ధర
- నర్సంపేట డివిజన్ ఉద్యాన శాఖ అధికారి ఆలకొండ జ్యోతి


ఆలకొండ జ్యోతి

దుగ్గొండి: మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేకపోవడం, భూమిలో సారం తగ్గి దిగుబడి గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. వ్యవసాయానికి అనుబంధంగా కూరగాయ పంటల సాగు కొంత లాభదాయకంగానే ఉంది. కానీ, పంట వేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో నష్టాల పాలవుతున్నారు. పంట వేసే సమయం, పంట సాగు విధానం, మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తే అధిక లాభాలు గడించవచ్చని నర్సంపేట డివిజన్ ఉద్యాన శాఖ అధికారి ఆలకొండ జ్యోతి తెలిపారు.

చిక్కుడు..

తీగ చిక్కుడు, చెట్టు చిక్కుడును రైతులు సాధారణంగా జూన్, జూలై నెలల్లో సాగు చేస్తారు. అందరు ఒకేసారి సాగుచేయడంతో పంట ఉత్పత్తులు మార్కెట్‌ను ముంచెత్తుతాయి. ఫలితంగా ధరలు తగ్గిపోతాయి. చిక్కుడు కాయలు తెంపిన కూలీలకు కూడా కూలి చెల్లించని పరిస్థితి దాపురిస్తుంది.

మే 15 లోపు సాగు లాభదాయకం..

రైతులు చిక్కుడును మే 15లోపు సాగుచేయాలి. చిక్కుడు విత్తనాలు నాటి తీగలు పారడానికి లైన్ సపోర్టింగ్ కర్రలు పాతాలి. కర్రలకు మెష్ తీగలు అల్లాలి. ఇలా చేయడం వల్ల జూన్ మొదటి వారానికి కాయలు కోతకు వస్తాయి. జూలై, ఆగస్టు,



సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో మంచి ధర పలుకుతుంది. డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఇలా చేయడం వల్ల ఎకరానికి రూ.1.50 లక్షల ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుంది.

మే 15 నుంచి బీర సాగు లాభదాయకం..

ఈనెల 15 నుంచి బీర సాగును తాత్కాలిక పందిళ్లు వేసి సాగు చేయాలి. మార్కెట్‌లో అనేక రకాల హైబ్రిడ్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. కర్రలతో తాత్కాలిక పందిళ్లు లేదా ఉపాధిహామీ పథకంలో భాగంగా శాశ్వత పందిళ్లు ఏర్పాటు చేసుకుని సాగు చేయాలి. జూన్ 20 వరకు దిగుబడి మొదలవుతుంది. ఆ సమయంలో మార్కెట్‌లో బీర కాయలకు మంచి ధర పలుకుతుంది. ఆలస్యంగా బీర సాగు చేస్తే మార్కెట్‌లోకి సరుకు ఎక్కువగా వచ్చి ధర పడిపోతుంది.

పచ్చిమిరప, ఆకు కూరలు..

రైతులు కొద్దిపాటి భూమిలో తాత్కాలిక షేడ్‌నెట్‌ను ఏర్పాటు చేసుకుని మే నెలలో పచ్చిమిరప సాగు చేయాలి. ఇలా చేయడం వల్ల జూన్, జులై నెలల్లో పచ్చిమిరప చేతికి అందుతుంది. జూన్, జూలై, ఆగస్టు,సెప్టెంబర్, అక్టోబర్ వరకు మంచి ధరలు ఉంటాయి. మార్కెట్‌లో మంచి హైబ్రిడ్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. విత్తనం ఏదైనా షేడ్‌నెట్ కింద సాగు లాభదాయకంగానే ఉంటుంది.

ఆకు కూరలు..

వేసవి కాలంలో ఆకుకూరలు దొరకడం చాలా కష్టం. ఈ సమయంలోనే ఆకు కూరలు అందుబాటులోకి వచ్చేలా సాగుచేయాలి. మే, జూన్ నెలల్లో ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల షేడ్ నెట్‌లు ఏర్పాటు చేసుకుని వాటికింద కొత్తిమీర, పాలకూర, చుక్కకూర, తోటకూర సాగు చేయాలి. కేవలం 30 రోజుల వ్యవధిలోనే చేతికి అందుతాయి. మంచి ధర ఉండటం వల్ల లాభాలు వస్తాయి. సమయానుగుణంగా కూరగాయలు, ఆకుకూరల పంటలు సాగు చేస్తే ఎకరం భూమిలో వచ్చే ఆదాయం 10 గుంటల్లో వస్తుంది. రైతులు సమయం చూసుకుని, మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా ఆకుకూరలు, కూరగాయల పంటలు సాగు చేయాలి.

టమాట..

వేసవికాలంలో టమాట సాగు చేయడం వల్ల మంచి లాభాలు వస్తాయి. తాత్కాలిక షేడ్‌నెట్‌ను ఏర్పాటు చేసుకుని మే, జూన్ నెలల్లో విత్తనాలు నాటాలి. పంట మే, జూన్, జూలై నెలల్లో చేతికి అందితే మంచి ధర పలుకుంది. నవంబర్, డిసెంబర్, జనవరి వరకు ఎక్కువ ధర ఉంటుంది. ఫిబ్రవరి, మార్చిలో ధర పడిపోతుంది. ధర పడిపోయే సమయంలో టమాటాలు చేతికి అందితే నష్టాలు వస్తాయి. షేడ్‌నెట్ వేసి గుంజలు పాతి పైన తీగ కట్టాలి తీగకు టమాట తీగలను దారంతో నేలకు ఆనకుండా కట్టాలి. ఇలా చేయడం వల్ల కాసిన టమాటాలు చేతికి అందుతాయి. కుళ్లిపోకుండా, తెగుళ్లు రాకుండా నాణ్యంగా ఉంటాయి.

ఆ ఊరి కోసం 3 రోజుల ట్రెక్కింగ్!

హిమాచల్‌లో ఎన్నికల సిబ్బంది సాహసం

అది హిమాలయ పర్వత శ్రేణుల్లోని ఓ గ్రామం. పేరు బారా – భంగల్. సముద్ర మట్టానికి 2,575 మీటర్ల ఎత్తులో ఉంటుంది. దాన్ని ఆనుకునే రావి నదీ ప్రవాహం సాగిపోతుంటుంది. ఆ ఊరికి రోడ్డు మార్గం లేదు. చేరుకోవాలంటే ట్రెక్కింగ్ ద్వారానే సాధ్యం. పైగా అందుకు మూడు నాలుగు రోజులు పాటు సాహసయాత్ర చేయాల్సిందే! హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రా జిల్లా బైజంత్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న ఈ కుగ్రామంలో 468 మంది ఓటర్లున్నారు. హిమాలయాల్లో ఎక్కడో మూలన విసిరేసినట్టుండే ఈ గ్రామం ఏడాదిలో ఆర్నెల్ల పాటు పూర్తిగా మంచుమయంగా మారుతుంది. దాంతో నవంబర్ నుంచి ఏప్రిల్ దాకా స్థానికులు కూడా సమీపంలోని బీర్‌కు వలస పోతారు. ఈ గ్రామాన్ని సందర్శించాలంటే మే నెల నుంచి అక్టోబర్ మధ్యే సాధ్యం! అయినా 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఈ గ్రామంలో అందరూ ఓటేయడం విశేషం! ప్రతికూల వాతావరణం వల్ల ఆ ఎన్నికలప్పుడు హెలికాప్టర్‌ను వాడటం కుదర్లేదు. దాంతో 18 మందితో కూడిన ఎన్నికల బృందం 40 కిలోమీటర్లు ట్రెక్ చేసి మరీ గ్రామానికి చేరుకుంది! ఈసారి కూడా ఎన్నికల సిబ్బంది ట్రెక్కింగ్‌నే నమ్ముకుంటున్నారు. ''వారు పోలింగ్‌కు కొన్ని రోజుల ముందే బయల్దేరతారు. రోడ్డు మార్గంలో రాజ్‌గుండ్ దాకా చేరుకుంటారు. అక్కడి నుంచి మూడు రోజులు ట్రెక్ చేసి బారా భంగల్ చేరతారు'' అని కాంగ్రా జిల్లా ఎన్నికల అధికారి హేమ్‌రాజ్ బైర్వా వివరించారు. ఈవీఎం తదితర పోలింగ్ సామగ్రి తరలింపు కోసం హెలికాప్టర్ సమకూర్చాలని కోరనున్నామన్నారు. ''గ్రామస్తుల్లో బారా భంగల్‌లో ఎవరున్నారు, బీర్‌లో ఎవరున్నారో ఎన్నికల ముందు సర్వే చేసి తెలుసుకుంటాం. తదనుగుణంగా ఓటర్ల జాబితాను వేరు చేసి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం'' అని ఆయన తెలిపారు. అన్నట్టూ, ఈ ఊళ్లో సెల్ నెట్‌వర్క్ కూడా ఉండదు. దాంతో ఎన్నికల సిబ్బంది శాటిలైట్ ఫోన్లు వాడతారు. ఇక్కడ జూన్ 1న చివరిదైన ఏడో విడతలో పోలింగ్ జరగనుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్



చిల్కా సరస్సులోని కాళీజయీ ద్వీపం

సరిహద్దు సమరం

ఒడిశాలో బీజేడీ, కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీ

- రాష్ట్రంలో లోక్‌సభతో పాటు అసెంబ్లీకీ ఎన్నికలు
- నేడు 4 లోక్‌సభ స్థానాల పరిధిలో పోలింగ్
- వాటిలో మూడు ఏపీ సరిహద్దు స్థానాలే

ఒడిశాలో ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది. నాలుగో విడతలో భాగంగా రాష్ట్రంలో సోమవారం తొలి దశ పోలింగ్ జరగనుంది. లోక్‌సభతో పాటు ఒడిశా అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతుండటంతో పార్టీలన్నీ హోరాహోరీ తలపడుతున్నాయి. రాష్ట్రంలో 21 లోక్‌సభ, 147 అసెంబ్లీ సీట్లున్నాయి. గత ఎన్నికల్లో బీజేడీ 12, బీజేపీ 8 లోక్‌సభ సీట్లు గెలుచుకున్నాయి. సోమవారం 4 లోక్‌సభ స్థానాలు, వాటి పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల జాతకాలు తేలిపోనున్నాయి. వీటిలో మూడు లోక్‌సభ స్థానాలు ఏపీ సరిహద్దు ప్రాంతాలే. అధికార బిజూ జనతాదళ్, ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి మధ్య ఒడిశాలో త్రిముఖ పోరు జరుగుతోంది. బీజేడీని గద్దె దింపడంతో పాటు మెజారిటీ లోక్‌సభ స్థానాలు కొల్లగొట్టేందుకు బీజేపీ శ్రమిస్తోంది. కాంగ్రెస్ కూడా పూర్వ వైభవం కోసం సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఇక రెండు దశాబ్దాలకు పైగా సీఎం కుర్చీలో పాతుకుపోయిన బీజేడీ చీఫ్ నవీన్ పట్నాయక్ రెండు జాతీయ పార్టీలనూ నిలువరించేందుకు పోరాడుతున్నారు. పోలింగ్ జరగనున్న 4 లోక్‌సభ స్థానాల్లో పరిస్థితిపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

బరంపూర్... జంపింగ్ జపాంగ్!

ఏపీతో సరిహద్దులు పంచుకుంటున్న ఈ నియోజకవర్గంలో తెలుగువారు ఎక్కువగా ఉంటారు. బరంపూర్ ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట. దివంగత ప్రధాని పీవీ నరసింహారావు 1996లో ఇక్కడి నుంచి గెలిచారు. 1999లో కాషాయ జెండా కూడా ఎగిరింది. 2009 నుంచీ బీజేడీ హవాయే సాగుతోంది.

ఇక్కడ బరిలో ఉన్న, గెలిచిన అభ్యర్థులు పార్టీలు మారిన వారే కావడం విశేషం. 2004 నుంచి 2019 మధ్య చంద్రశేఖర్ సాహు, ఒరియా సినీ నటుడు సిద్ధాంత మహాపాత్ర చెరో రెండుసార్లు గెలిచారు. సాహు 2004లో కాంగ్రెస్ తరఫున గెలిచి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. 2009, 2014ల్లో బీజేడీ అభ్యర్థి మహాపాత్ర చేతిలో ఓడారు. తర్వాత సాహు కాంగ్రెస్‌ను వీడి బీజేడీలో చేరారు! 2019లో ఆ పార్టీ టికెట్‌పై గెలిచారు. ఈసారి మాత్రం బీజేపీ నుంచి వచ్చిన భృగు బాక్సిపాత్రకు బీజేడీ టికెటివ్వడం విశేషం. భృగు 2019లో బీజేపీ తరఫున పోటీ చేసి సాహు చేతిలో ఓడారు. బీజేపీ ఈసారి సీఎం నవీన్ మాజీ అనుచరుడు ప్రదీప్‌కుమార్ పాణిగ్రాహికి టికెటిచ్చింది. కాంగ్రెస్ అభ్యర్థి రష్మి రంజన్ పట్నాయక్ కూడా గట్టి పోటీ ఇస్తున్నారు.



- ప్రదీప్‌కుమార్ పాణిగ్రాహి



- భృగు బాక్సిపాత్ర

కలహండి... కమలానికి ఎదురుగాలి!

బీజేపీకి తొలి నుంచీ గట్టి పట్టున్న స్థానం. కానీ 2009లో కాంగ్రెస్, 2014లో బీజేడీ గెలిచాయి. 2019లో మళ్లీ బీజేపీ నెగ్గింది. ఈసారి సిట్టింగ్ ఎంపీ బసంత కుమార్ పండాను పక్కనపెట్టి కలహండి రాజ కుటుంబానికి చెందిన మాళవిక కేసరీ దేవ్‌కు టికెటిచ్చింది. స్థానికులు రాణి మాతగా పిలుచుకునే మాళవిక మాజీ ఎంపీ అర్కా కేసరీ దేవ్ భార్య. అర్కా తండ్రి విక్రమ్ కేసరీ దేవ్ ఇక్కడ మూడుసార్లు బీజేపీ తరఫున గెలవడం విశేషం. ఆయన మరణానంతరం అర్కా ఇక్కడి నుంచే బీజేడీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. కానీ 2019లో బీజేడీ టికెట్ నిరాకరించడంతో పార్టీకి గుడ్‌బై చెప్పారు. 2023లో బీజేపీలో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి ద్రౌపది మఝి ఎస్టీ నేత. గిరిజనుల్లో బాగా పట్టుంది. నియోజకవర్గంలో 4 లక్షల ఎస్టీ ఓట్లుండటం ఆమెకు కలిసొచ్చే అంశం. గౌడ సామాజిక వర్గానికి చెందిన లంబూధర్ నియాల్‌ను బీజేడీ బరిలోకి దించింది. గత ఎన్నికల్లో బీజేపీకి 26 వేల ఓట్ల మెజారిటీయే వచ్చింది. ఈసారి కూడా త్రిముఖ పోరులో బీజేపీకి ఎదురుగాలి వీస్తోందంటున్నారు.



- లంబూధర్ నియాల్



- మాళవిక కేసరీ దేవ్

కోరాపుట్...
బీజేడీ, కాంగ్రెస్ మధ్యలో బీజేపీ!

కనువిందు చేసే తూర్పు కనుమలు, అబ్బురపరిచే జలపాతాలతో ఒడిశా కశ్మీర్‌గా పేర్కొందిన కోరాపుట్ ఒకప్పుడు కాంగ్రెస్ దుర్గం. మాజీ సీఎం గిరిధర్ గమాంగ్ అడ్డా. ఇక్కడినుంచి తొమ్మిదిసార్లు ఎంపీగా గెలిచిన రికార్డు ఆయనది! 1999లో సీఎంగా ఉంటూ కేంద్రంలో వాజ్‌పేయి ప్రభుత్వం విశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేసి గద్దె దించిన అపప్రథను గమాంగ్ మూటగట్టుకున్నారు. 2009, 2014ల్లో బీజేడీ చేతిలో ఓటమి చవిచూశారు. 2023లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన గమాంగ్ అనంతరం బీఆర్ఎస్‌కు జై కొట్టడం విశేషం! 2019లో కాంగ్రెస్ అభ్యర్థి సప్తగిరి శంకర్ ఉలాక కేవలం 3,613 ఓట్ల మెజారిటీతో గెలిచారు. బీజేడీ నుంచి మాజీ ఎంపీ ఝినా హికాక భార్య కౌసల్య పోటీ చేస్తున్నారు. బీజేపీ కలిరామ్ మఝిని బరిలోకి దించింది. నియోజకవర్గంలో మంచి పట్టున్న జయరాం చేరికతో కాంగ్రెస్ మరింత బలోపేతమైంది. పోటీ ప్రధానంగా బీజేడీ, కాంగ్రెస్ మధ్యే ఉంది. దాంతో బీజేపీ చీల్చే ఓట్లు కీలకంగా మారాయి.



- కౌసల్య హికాక



- సప్తగిరి శంకర్ ఉలాక

నవరంగ్‌పూర్... టఫ్ ఫైట్

ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న మరో ఎస్టీ నియోజకవర్గమిది. ఇదీ గతంలో కాంగ్రెస్ కంచుకోటే. ఖగపాటి ప్రధాని రికార్డు స్థాయిలో వరుసగా తొమ్మిదిసార్లు గెలిచారు. తర్వాత నెమ్మదిగా బీజేపీ, ఆపై బీజేడీ ఇక్కడ పాగా వేశాయి. 2014లో బీజేడీ నుంచి బలభద్ర మఝి కేవలం 2,042 ఓట్ల తేడాతో కాంగ్రెస్‌ను ఓడించారు. ఆయన 2019లో పార్టీ మారి బీజేపీ తరఫున పోటీ చేశారు. బీజేడీ అభ్యర్థి రమేశ్ చంద్ర మఝి చేతిలో ఓటమి చవిచూశారు. ఈసారీ బీజేపీ నుంచి మళ్లీ బరిలో ఉన్నారు. బీజేడీ మాత్రం సిట్టింగ్‌ను పక్కన పెట్టి కాంగ్రెస్ నుంచి వచ్చిన మాజీ ఎంపీ ప్రదీప్ కుమార్ మఝికి టికెటివ్వడం విశేషం. కాంగ్రెస్ నుంచి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే భుజబల్ మఝిని రంగంలో ఉన్నారు. ఇక్కడ పోటీ ప్రధానంగా బీజేడీ, కాంగ్రెస్ మధ్యే ఉంటున్నా బీజేపీకి భారీగా ఓట్లు పడుతున్నాయి. ఈసారి ఇక్కడ గెలుపును బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మోదీతో సహా బీజేపీ అగ్ర నేతలు ముమ్మరంగా ప్రచారం చేశారు. దాంతో పోటీ త్రిముఖంగా మారి ఉత్కంఠ రేపుతోంది!



- బలభద్ర మఝి



- ప్రదీప్ కుమార్ మఝి

తూర్పు భారతంలో కీలక రాష్ట్రమైన జార్ఖండ్‌లో ఎన్నికల పర్వానికి రంగం సిద్ధమైంది. సోమవారం తొలి దశ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలో 14 లోక్ సభ స్థానాలకు నాలుగు విడతల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. సోమవారం 4 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. కేంద్ర గిరిజన శాఖ మంత్రి, జార్ఖండ్ మాజీ సీఎం అర్జున్ ముండా, మాజీ సీఎం మధు కోడా భార్య గీత, మాజీ డీజీపీ విష్ణు దయాళ్ రామ్ తదితర ప్రముఖులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 10 జిల్లాల పరిధిలో విస్తరించిన ఈ నాలుగూ రిజర్వ్‌డ్ స్థానాలే కావడం విశేషం. పలాము ఎస్సీ, మిగతా మూడు ఎస్టీ నియోజకవర్గాలు. ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తదితరులు ఇక్కడ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో పోటీ ప్రధానంగా బీజేపీ; కాంగ్రెస్, జేఎంఎంలతో కూడిన విపక్ష ఇండియా కూటమి మధ్యే ఉంది. 2019 ఎన్నికల్లో ఈ నాలుగు స్థానాల్లో మూడు బీజేపీ, ఒకటి కాంగ్రెస్ నెగ్గాయి...

- సాక్షి, నేషనల్ డెస్క్



'బాస్ శిల్ప్' పేరిట జార్ఖండ్ గిరిజనులు తయారు చేసే వెదురు వస్తువులు

ఎవరికి రిజర్వ్‌డ్!

జార్ఖండ్‌లో నేడే తొలి దశ

- 4 లోక్‌సభ స్థానాలకు పోలింగ్
- మూడు బీజేపీ సిట్టింగ్ సీట్లే
- గిరిజనుల ఆధిపత్యమే ఎక్కువ

ఖుంటీ

కేంద్ర మంత్రి, బీజేపీ సిట్టింగ్ ఎంపీ అర్జున్ ముండా మరోసారి బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కాళీచరణ్ ముండాపై కేవలం 1,445 ఓట్ల ఆధిక్యంతో నెగ్గారాయన. కాంగ్రెస్ నుంచి మళ్లీ కాళీచరణే బరిలో ఉన్నారు. ఖుంటీ బీజేపీ కంచుకోట. ఆ పార్టీ నేత కరియా ముండా ఇక్కడ ఏకంగా ఎనిమిది సార్లు గెలిచారు. గిరిజనుల ఆరాధ్యుడు బిర్సా ముండా స్వగ్రామం ఉలిహాట్ ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉంది. గత నవంబర్‌లో మోదీ ఈ గ్రామాన్ని సందర్శించి బిర్సా ముండాకు నివాళులర్పించారు. పేదరికం, మానవ అక్రమ రవాణా, మావోయిజం, నల్లమందు సాగు ఇక్కడి ప్రధాన సమస్యలు. కాంగ్రెస్ అభ్యర్థి కాళీచరణ్‌కు గిరిజనుల్లో పలుకుబడి ఉంది. రెండుసార్లు ఎమ్మెల్యేగా చేశారు. కూటమి భాగస్వామి జేఎంఎం మాజీ ఎమ్మెల్యే బసంత్ కుమార్ లోంగా రెబల్‌గా పోటీ చేస్తున్నారు. దాంతో ఆ పార్టీ నుంచి కాంగ్రెస్‌కు ఓట్ల బదిలీ ఏ మేరకు జరుగుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది.



- అర్జున్ ముండా



- కాళీచరణ్ ముండా

సింగ్‌భమ్

కాంగ్రెస్ పార్టీకి బలమైన స్థానమిది. ఐదుసార్లు కాంగ్రెస్, మూడుసార్లు బీజేపీ, ఒసారి జేఎంఎం, ఐదుసార్లు జార్ఖండ్ పార్టీ గెలిచాయి. సింగ్‌భమ్‌లో మాజీ సీఎం మధు కోడా కుటుంబానికి గట్టి పట్టుంది. 2009లో మధు కోడా స్వతంత్ర అభ్యర్థిగా గెలిచారు. 2014లో మాత్రం బీజేపీ నేత లక్ష్మణ్ గిలువా చేతిలో ఓటమి చవిచూశారు. 2019 ఎన్నికల్లో మధు కోడా భార్య గీత కాంగ్రెస్ టికెట్‌పై గెలిచారు. జార్ఖండ్‌లో కాంగ్రెస్ గెలిచిన ఏకైక స్థానం ఇదే. కానీ గీత గత ఫిబ్రవరిలో బీజేపీలో చేరి ఆ పార్టీ తరఫున బరిలో దిగారు. పొత్తులో భాగంగా కాంగ్రెస్ దీన్ని జేఎంఎంకు కేటాయించింది. దీంతో ఇక్కడ గెలుపును జేఎంఎం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్ర మంత్రిగా చేసిన ఐదుసార్లు ఎమ్మెల్యే జోబా మాంఝిని రంగంలోకి దింపింది.




- గీతా కోడా



- జోబా మాంఝి

లోహర్దగ

ఇది బీజేపీ సిట్టింగ్ స్థానం. అయితే సిట్టింగ్ ఎంపీ సుదర్శన్ భగత్‌ను పక్కన పెట్టి సమీర్ ఒరాన్‌కు టికెటిచ్చింది. గత ఎన్నికల్లో ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి సుఖ్‌దేవ్ భగత్ ఈసారీ బరిలో ఉన్నారు. జార్ఖండ్ పార్టీ నుంచి దియోకుమార్ ధాన్ పోటీ చేస్తున్నారు. బిష్ణుపూర్ జేఎంఎం ఎమ్మెల్యే చమ్రా లిండా కూడా ఇండిపెండెంట్‌గా బరిలో ఉండటం విశేషం! ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉంది. ఈ నియోజకవర్గంలో 70 శాతానికి పైగా గిరిజన జనాభాయే.



- సుఖ్‌దేవ్ భగత్



- సమీర్ ఒరాన్

పలాము

రాష్ట్రంలో ఏకైక ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానం. మాజీ డీజీపీ విష్ణు దయాళ్ రామ్ బీజేపీ టికెట్‌పై 2019లో 4.77 లక్షల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. ఇండియా కూటమి నుంచి ఆర్జేడీ తరఫున మమతా భూయాన్ పోటీలో ఉన్నారు. ఇక్కడ 2009లో జేఎంఎం గెలవగా 2014లో విష్ణు దయాళ్ బీజేపీ అభ్యర్థిగా తొలిసారి నెగ్గారు. ఆయనకు మద్దతుగా ప్రధాని మోదీ పలాములో భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. మమతా భూయాన్ రాజకీయాలకు కొత్తయినా ఇక్కడ ఆమె సామాజిక వర్గం ఓటర్లు 4.5 లక్షలకు పైగా ఉంటారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆరు అసెంబ్లీ సీట్లలో నాలుగు బీజేపీ చేతిలోనే ఉన్నాయి.



- మమతా భూయాన్



- విష్ణు దయాళ్ రామ్

అక్కడ తొలిసారి ఓటింగ్

సింగ్‌భమ్ లోక్‌సభ స్థానం పరిధిలో మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువ. దాంతో మారుమూల గ్రామాల్లోని వారికి ఓటేసే అవకాశం ఉండేది కాదు. అడవులు, కొండల్లోని అలాంటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల ప్రజలు కూడా దశాబ్దాల విరామం తర్వాత ఈసారి ఓటేయనున్నారు. అనేక కష్టనష్టాలకోర్చి అక్కడ 118 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందుకోసం పోలింగ్ సిబ్బంది కిలోమీటర్ల కొద్దీ నడిచి వెళ్లారు. దట్టమైన అడవిలో ఉన్న సరండ అనే మారుమూల గ్రామానికైతే హెలికాప్టర్ ద్వారా ఎన్నికల సామగ్రిని తరలించారు. ఏ ఓటరూ ఓటింగ్‌కు దూరంగా ఉండొద్దన్నది తమ సంకల్పమని వెస్ట్ సింగ్‌భమ్ జిల్లా ఎన్నికల అధికారి కులదీప్ చౌదరి తెలిపారు.

మహిళల ఓట్లే కీలకం

సింగ్‌భమ్, ఖుంటి, లోహర్దగ స్థానాల్లో అభ్యర్థుల భవితవ్యం మహిళల చేతుల్లో ఉందని చెప్పాలి! ఎందుకంటే అక్కడ పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ. జార్ఖండ్‌లో గిరిజన మహిళలు పురుషులతో సమానంగా సామాజిక, ఆర్థిక వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటారు. ఓటింగ్‌లోనూ చురుకైన పాత్ర పోషిస్తుంటారు. దాంతో మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు బీజేపీ, ఇండియా కూటమి అన్ని ప్రయత్నాలూ చేశాయి.

తోటల నగరంలో ఓట్ల వేట!

శ్రీనగర్. తోటల నగరం. నిషాత్ బాగ్, షాలిమార్ గార్డెన్స్, చష్మేషాహీ గార్డెన్, నెహ్రూ బొటానికల్ గార్డెన్, ఇందిరాగాంధీ తులిప్ గార్డెన్ వంటి అత్యంత అందమైన పూదోటలకు, ప్రఖ్యాత దాల్ సరస్సుకు నిలయం. జమ్మూ కశ్మీర్లోని ఐదు లోక్‌సభ స్థానాల్లో ఒకటైన శ్రీనగర్‌లో సోమవారం పోలింగ్ జరగనుంది. ముక్కోణపు పోటీలో ఎవరు గెలుస్తారన్నది ఆసక్తికరంగా మారింది....

- సాక్షి, నేషనల్ డెస్క్



శ్రీనగర్ తులిప్ గార్డెన్

శ్రీనగర్‌లో ముక్కోణపు పోరు

అబ్దుల్లాలదే ఆధిపత్యం

జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా, ఆర్టికల్ 370 రద్దయ్యాక జరుగుతున్న తొలి ఎన్నికలివి. రాష్ట్రంలో ఆరు లోక్‌సభ స్థానాలుండేవి. జమ్మూ కశ్మీర్, లద్దాక్ కేంద్రపాలిత ప్రాంతాలుగా మారాక ఐదు జమ్మూ కశ్మీర్ పరిధిలోకి, ఒకటి లద్దాఖ్ కిందకు వెళ్లాయి. శ్రీనగర్‌లో విజయం నేషనల్ కాన్ఫరెన్స్, జమ్మూ కశ్మీర్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (జేకేపీడీపీ) మధ్యే చేతులు మారుతుంటుంది. 2017 ఉప ఎన్నికలు, 2019 ఎన్నికల్లో ఎన్సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా విజయం సాధించారు. అంతకుముందు 2014లో ఆయనపై పీడీపీ నేత తారిక్ హమీద్ కర్రా నెగ్గారు. 2009లో ఫరూక్ అబ్దుల్లా, 2004లో ఆయన కుమారుడు ఒమర్ అబ్దుల్లా విజయం సాధించారు. ఈసారి ఎన్సీ నుంచి ఆగా సయ్యద్ రుహుల్లా మెహెదీ, పీడీపీ నుంచి వహీదుర్ రెహమాన్ పర్రా, జమ్మూ కశ్మీర్ అప్నీ పార్టీ నేత మహమ్మద్ అష్రఫ్ మిర్ బరిలో ఉన్నారు. డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ అజాద్ పార్టీ, జమ్మూ కశ్మీర్ పాంథర్స్ పార్టీ, లోక్‌తాంత్రిక్ పార్టీతో పాటు 18 మంది స్వతంత్రులు కూడా పోటీలో ఉన్నారు. శ్రీనగర్ లోక్‌సభ స్థానంలో ఆది నుంచీ ఎన్సీదే ఆధిపత్యం. 13సార్లు ఎన్నికలు జరిగితే 10సార్లు ఆ పార్టీయే విజయం సాధించింది.

ఓటర్లలో నిరుత్సాహం...

శ్రీనగర్ లోక్‌సభ స్థానంలో 2009 లోక్‌సభ ఎన్నికల్లో 25.5 శాతం, 2014లో 25.86 శాతం పోలింగే నమోదైంది. ఇక 2019 ఎన్నికల్లో మరీ 14.43 శాతానికి పడిపోయింది! ఈసారి కూడా శ్రీనగర్ వాసుల్లో ఓటింగ్ పట్ల నిరుత్సాహమే కనిపిస్తోంది.

వలసదారులకు ఉన్నచోటే ఓటు!

జమ్మూ కశ్మీర్లోని శ్రీనగర్, బారాముల్లా, అనంతనాగ్ లోక్‌సభ స్థానాల పరిధిలో 1.13 లక్షల కశ్మీరీ వలసదారులు ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 52,100 మంది శ్రీనగర్ లోక్‌సభ స్థానంలో సోమవారం ఓటేయనున్నారు. వీరి కోసం జమ్మూలో 21, ఢిల్లీలో 4, ఉధంపూర్‌లో ఒకటి చొప్పున మొత్తం 26 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం విశేషం. అంతేగాక ఓటర్లను ఇంటి నుంచి పోలింగ్ కేంద్రాల వరకు తీసుకెళ్లి తిరిగి ఇంటి వద్ద దిగబెట్టే ఏర్పాట్లు కూడా చేశారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
260	98
72,664	22,055

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు


నాస్‌డాక్	16,341	▽	5
డోజోన్స్	39,513	▲	125
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,434	▲	52
డాక్స్	18,773	▲	86
షాంఘై	3,155	▲	1
నికాయ్	38,229	▲	155

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.67	85.35
£	బ్రిటన్ పౌండ్		102.22	107.11
€	యూరో		87.81	92.26
¥	జపాన్ ఎన్ (100)		41.00	66.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		52.81	87.62
S$	సింగపూర్ డాలర్		59.33	64.05
SAR	సౌదీ రియాల్		21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్		21.85	23.63
¥	చైనా యువాన్		10.44	12.51

పెట్టుబడి మొత్తం ఈక్విటీలకేనా?



సంపాదనను సంపదగా మార్చుకోవాలంటే అనుకూలమైన వేదికల్లో ఈక్విటీ ముందుంటుంది. రియల్ ఎస్టేట్ సైతం దీర్ఘకాలంలో మంచి సంపద సృష్టికి మార్గమవుతుంది. కానీ, ఈక్విటీ మాదిరి సులభమైన లిక్విడిటీ సాధనం రియల్ ఎస్టేట్ కాబోదు. మొత్తం పెట్టుబడిని ఒకటి రెండు రోజుల్లోనే వెనక్కి తీసుకోవడానికి స్టాక్ మార్కెట్ వీలు కల్పిస్తుంది. ఎక్కువ మంది ఇన్వెస్టర్లు ఈ విభాగం వైపు అడుగులు వేయడానికి గల కారణాల్లో ఇదీ ఒకటి. అయితే, ఒకరి పోర్ట్‌ఫోలియోలో ఈక్విటీ పెట్టుబడులు ఎంత మేర ఉండాలి..? రిటైల్ ఇన్వెస్టర్లలో చాలా మంది దీనికి సూటిగా బదులు ఇవ్వలేరు. ఈక్విటీల జిగేల్ రాబడులు చూసి చాలా మంది తమ పెట్టుబడులు మొత్తాన్ని స్టాక్స్‌లోనే పెట్టేస్తుంటారు. ఇలా చేయడం ఎంత వరకు సబబు? అసలు ఈ విధంగా చేయవచ్చా? ఒకరి పెట్టుబడుల కేటాయింపులు ఎలా ఉండాలి? ఈ విషయాలపై స్పష్టత కోసం కొన్ని కీలక అంశాలను ఒకసారి మననం చేసుకోవాల్సిందే.

- ఉన్నట్టుండి మార్కెట్లు కుప్పకూలితే?
- భయంతో దూరంగా వెళ్లిపోకూడదు
- అదనంగా పెట్టుబడులు పెట్టగలగాలి
- పతనాల్లో అమ్ముకోవడం ప్రతికూలం
- రిస్క్, రాబడుల అవసరాలు సమీక్షించుకోవాలి
- కాలవ్యవధి ఆధారంగా ఈక్విటీ కేటాయింపులు



మీరు ఎలాంటి వారు?

బుల్ మార్కెట్లో రిస్క్ తీసుకునేందుకు వెనుకాడకపోవడం.. బేర్ మార్కెట్లో రిస్క్‌కు దూరంగా ఉండడం రిటైల్ ఇన్వెస్టర్లలో కనిపించే సాధారణ లక్షణం. సుప్రసిద్ధ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ సూత్రానికి ఇది పూర్తి విరుద్ధం. ''ఇతరులు అత్యాశ చూపుతున్నప్పుడు భయపడాలి.. ఇతరులు భయపడుతున్నప్పుడు అత్యాశ చూపాలి'' అన్నది బఫెట్ స్వీయ అనుభవ సారం. మెజారిటీ రిటైల్ ఇన్వెస్టర్లు దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తుంటారు. పైగా తమ రిస్క్ స్థాయి ఎంతన్నది కూడా పరిశీలించుకోరు. పెట్టుబడిపై భారీ రాబడుల అంచనాలే వారి నిర్ణయాలను నడిపిస్తుంటాయి. దీర్ఘకాలంలో స్టాక్ మార్కెట్లో రాణించాలంటే ఇలాంటి ప్రతికూల ధోరణులు అస్సలు పనికిరావు.

అత్యవసర నిధి



ఉన్నట్టుండి ఉపాధి కోల్పోయి ఏడాది, రెండేళ్ల పాటు ఎలాంటి ఆదాయం రాకపోయినా జీవించగలరా? ప్రతి ఒక్కరూ ఒకసారి ఇలా ప్రశ్నించుకోవాలి. లేదంటే ఏడాది, రెండేళ్ల జీవన అవసరాలు తీర్చే దిశగా అత్యవసర నిధి ఏర్పాటు చేసుకోవాల్సిందే.

దీర్ఘకాలం కోసమేనా?



దీర్ఘకాలం అంటే ఎంత? అనే దానిపై ఇన్వెస్టర్లలో భిన్నమైన అంచనాలు ఉండొచ్చు. కొందరు 2–3 ఏళ్లు, కొందరు 5–10 ఏళ్లను దీర్ఘకాలంగా భావిస్తుంటారు. కానీ, ఈక్విటీలో ఇన్వెస్ట్ చేసే వారు స్వల్పకాలాన్ని మరిచి.. అవసరమైతే దశాబ్దాల పాటు ఆ పెట్టుబడులు కొనసాగించే మైండ్‌సెట్‌తో ఉండాలి.

బేర్ మార్కెట్ తట్టుకున్నారా?



కరోనా సమయంలో (2020 మార్చి) స్టాక్ మార్కెట్ భారీగా పడిపోవడం, కొన్ని నెలల వ్యవధిలోనే అంతా కోలుకోవడాన్ని ఇన్వెస్టర్లు చూసి ఉండొచ్చు. కానీ, మార్కెట్లు అన్ని సందర్భాల్లోనూ అంత వేగంగా కోలుకుంటాయని చెప్పలేం. చారిత్రక డేటాను పరిశీలిస్తే బేర్ మార్కెట్ ఆరంభం నుంచి రికవరీకి ఎంత లేదన్నా మూడేళ్లు పడుతుంది. కనుక బేర్ మార్కెట్ ఎంత కాలం పాటు కొనసాగినా, ధైర్యంగా వేచి చూడాలి.

సాహసం



బేర్ మార్కెట్‌లో తమ పోర్ట్‌ఫోలియో స్టాక్స్ భారీ నష్టాల పాలవుతుంటే దాన్ని చూసి తట్టుకోలేక రిటైల్ ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడుతుంటారు. నిజానికి ఆ సమయంలో అదనపు పెట్టుబడులు పెట్టాలే కానీ, ఉన్న పెట్టుబడులను వెనక్కి లాగేసుకోకూడదన్నది మార్కెట్ పండితుల సూచన. ఇక్కడ చెప్పుకున్నట్టు అత్యవసరనిధి కలిగి, బేర్ మార్కెట్లో అదనంగా పెట్టుబడులు పెట్టే వెసులుబాటు.. లేదంటే ఉన్న పెట్టుబడులను కొనసాగించే మనో ధైర్యం ఉన్నవారు 100% పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించుకున్నా నష్టం లేదన్నది నిపుణుల నిర్వచనం.

రాబడులు

దీర్ఘకాలం పాటు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తే కచ్చితంగా రాబడులే వస్తాయా? నిఫ్టీ 50 టీఆర్ఐ (రోలింగ్ రాబడులు) ఐదేళ్ల కాల పనితీరును గమనిస్తే ఒక్కో ఏడాది 47 శాతం పెరగ్గా, ఒక ఏడాది మైనస్ 1 శాతం క్షీణించింది. 2007 నుంచి 2023 మధ్య ఒక ఏడాది 52 శాతం, మరొక ఏడాది 25 శాతం వరకు నిఫ్టీ సూచీ నష్టపోయింది. కానీ, 55 శాతం, 76 శాతం రాబడులు ఇచ్చిన సంవత్సరాలూ ఉన్నాయి.

నిఫ్టీ 50 రాబడి

సంవత్సరం	+/-
2023	19.42
2022	4.32
2021	24.12
2020	14.90
2019	12.02
2018	3.15
2017	28.65
2016	3.01
2015	-4.06
2014	31.39
2013	6.76
2012	27.70
2011	-24.62
2010	17.95
2009	75.76
2008	-51.79
2007	54.77


నూరు శాతం కాదు..?

ఎన్ని చెప్పుకున్నా.. మధ్యమధ్యలో అనుకోని ఆర్థిక అవసరాలు ఎదురవుతుంటాయి. కనుక సామాన్య మధ్యతరగతి ఇన్వెస్టర్లు నూరు శాతం పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించుకోవడం సమంజసం కాదన్నది నిపుణుల అభిప్రాయం. ఇలాంటి వారు ఒకటి కంటే ఎక్కువ సాధనాల మధ్య పెట్టుబడులు వర్గీకరించుకోవాలి (అస్సెట్ అలోకేషన్). ఏ సాధనంలో ఎంతమేర అన్నది నిర్ణయించుకోవాలంటే.. విడిగా ఒక్కొక్కరి ఆర్థిక అవసరాలు, లక్ష్యాలు, ఆశించే రాబడులు, రిస్క్ సామర్థ్యం, పెట్టుబడులు కొనసాగించడానికి ఉన్న కాల వ్యవధి ఇవన్నీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

అస్సెట్ అలోకేషన్ అంటే?



ఒకరు రూ.100 ఇన్వెస్ట్ చేయాలనుకుంటే.. ఇందులో ఈక్విటీకి ఎంత, డెట్‌కు ఎంత అన్నది నిర్ణయించుకోవడం. ఈ రెండు సాధనాలే కాదు, బంగారం, రియల్ ఎస్టేట్ తదితర సాధనాలు కూడా ఉన్నాయి. కానీ, ఎవరికైనా ఈ నాలుగు సాధనాలు సరిపోతాయి. మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఇన్వెస్ట్ చేస్తుంటే ఈక్విటీ ఫండ్స్, డెట్ ఫండ్స్, గోల్డ్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు.



డెట్‌లో రిస్క్

డెట్‌లో రిస్క్ లేదా? అంటే లేదని చెప్పలేం. ఇందులో వడ్డీ రేట్లు, క్రెడిట్ రిస్క్ ఉంటాయి. అందుకే ఏఏఏ రేటెడ్ సాధనాల ద్వారా క్రెడిట్ రిస్క్‌ను దాదాపు తగ్గించుకోవచ్చు. డెట్‌కు సింహ భాగం, కొంత శాతం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే 'ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్'ను సైతం అరుణ్ కుమార్ సూచించారు.

ఏ సాధనానికి ఎంత?




సాధారణంగా ఈక్విటీలకు ఎక్కువ కేటాయించుకోవడం వల్ల దీర్ఘకాలంలో మెరుగైన రాబడులకు అవకాశాలు ఉంటాయని చెప్పుకున్నాం. కనుక 20–30 ఏళ్ల వయసు వారు ఈక్విటీలకు 70–80 శాతం వరకు కేటాయించుకున్నా పెద్ద రిస్క్ ఉండబోదు. ఎందుకంటే వారు తమ పెట్టుబడులను దీర్ఘకాలంపాటు అంటే 20 ఏళ్ల పాటు కొనసాగించే వెసులుబాటుతో ఉంటారు. అదే 30–40 ఏళ్ల వయసు వారు ఈక్విటీలకు 50–70 శాతం మధ్య కేటాయించుకోవచ్చు. అంతకుపైన వయసున్న వారు 50 శాతం మించకుండా ఈక్విటీ పెట్టుబడులను కొనసాగించుకోవచ్చని నిపుణులు సూచిస్తుంటారు. 70 శాతం ఈక్విటీ కేటాయింపులు చేసుకునే వారు 20 శాతం డెట్‌కు, 10 శాతం బంగారంలో ఇన్వెస్ట్ చేయవచ్చు. 50 శాతం ఈక్విటీలకు కేటాయించే వారు 30–40 శాతం డేట్‌కు, బంగారానికి 10 శాతం వరకు కేటాయించొచ్చు. ఈ గణాంకాలన్నీ సాధారణీకరించి చెప్పినవి. విడిగా చూస్తే, 30 ఏళ్ల వయసున్న వ్యక్తికి 5 ఏళ్లలోపు వయసున్న ఇద్దరు పిల్లలు ఉన్నారని అనుకుందాం. అటువంటప్పుడు పిల్లల ఉన్నత విద్యకు 10–15 ఏళ్ల కాలంలో నిర్ణీత మొత్తం కావాల్సి వస్తుంది. అటువంటప్పుడు పెట్టుబడులకు 10–15 ఏళ్ల కాలం మిగిలి ఉంటుంది. కనుక ఈక్విటీలకు 70 శాతం వరకు, మిగిలినది డెట్, గోల్డ్‌కు కేటాయింపులు చేసుకోవచ్చు. పిల్లల వివాహం కోసం అయితే 20 ఏళ్లు, రిటైర్మెంట్ కోసం అయితే 30 ఏళ్ల కాలం ఉంటుంది. వీటి కోసం కూడా ఈక్విటీలకు గణనీయమైన కేటాయింపులు చేసుకోవచ్చు. ఒకవేళ ఐదేళ్లలోపు లక్ష్యాలు అయితే 80 శాతం డెట్‌కు, 20 శాతం ఈక్విటీలకు (ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్) కేటాయించుకోవచ్చు. మూడేళ్ల లక్ష్యాల కోసం అయితే పూర్తిగా డెట్‌కే పరిమితం కావడం శ్రేయస్కరం.

3టీ కార్యాచరణ

అస్సెట్ అలోకేషన్ విషయంలో మూడు 'టీ'ల కార్యాచరణను ఫండ్స్ ఇండియా రీసెర్చ్ హెడ్ అరుణ్ కుమార్ తెలియజేశారు. మొదటిది కాలం (టైమ్). ''చారిత్రకంగా చూస్తే దీర్ఘకాలంలో డెట్ (ఫిక్స్‌డ్ ఇన్‌కమ్)తో పోల్చినప్పుడు ఈక్విటీలే మెరుగైన పనితీరు చూపించాయి. కానీ స్వల్పకాలంలో 10–20 శాతం వరకు పతనాలు కనిపిస్తుంటాయి. అలాగే ఏడు–పదేళ్లకోసారి 30–60 శాతం వరకు పతనాలు కూడా సంభవిస్తుంటాయి. గత 40 ఏళ్ల చరిత్ర చూస్తే ఇదే తెలుస్తుంది. కానీ, ఈ 10–20 శాతం దిద్దుబాట్లు 30–60 శాతం పతనాలుగా ఎప్పుడు మారతాయన్నది ఎవరూ అంచనా వేయలేరు. ఇలాంటి పతనాలను ఎక్కువ మంది తట్టుకోలేరు. అందుకే పోర్ట్‌ఫోలియోలో డెట్‌ను చేర్చుకోవాలి. ఇది నిలకడైనది. దీర్ఘకాలంలో రాబడి 5–7 శాతం మధ్యే ఉంటుంది. కనుక ఈక్విటీలకు ఎంత కేటాయించాలన్న విషయంలో కాలాన్ని చూడాలి. ఎంత ఎక్కువ కాలం ఉంటే, ఈక్విటీలకు ఎక్కువ పెట్టుబడులు కేటాయించుకోవచ్చు. రెండోది టోలరెన్స్(టీ). అంటే నష్టాలను భరించే సామర్థ్యం. స్వల్పకాలంలో 10–20 శాతం పతనాలను తట్టుకునే సామర్థ్యం లేని వారు డెట్ కేటాయింపులు మరికాస్త పెంచుకోవచ్చు. ఈక్విటీలకు 50 శాతమే కేటాయించుకుంటే తరచూ వచ్చే పతనాల ప్రభావం తమ పోర్ట్‌ఫోలియోపై 10 శాతం, ఏడు–పదేళ్లకోసారి వచ్చే భారీ పతన ప్రభావాన్ని 25 శాతానికి తగ్గించుకోవచ్చు. మూడోది. ట్రేడాఫ్ (టీ). పెట్టుబడికి దీర్ఘకాలం ఉన్నప్పటికీ నష్టాల భయంతో రాబడుల్లో రాజీపడడం. ఏటా 12 శాతం రాబడి (ఈక్విటీల్లో దీర్ఘకాలం సగటు వార్షిక రాబడి) సంపాదిస్తే 20 ఏళ్లలో పెట్టుబడి 10 రెట్లు అవుతుంది. రాబడి ఏటా 10 శాతమే ఉంటే 20 ఏళ్లలో పెట్టుబడి ఏడు రెట్లే పెరుగుతుంది. 8 శాతం వార్షిక రాబడే వస్తే 20 ఏళ్లలో పెట్టుబడి ఐదు రెట్లే వృద్ధి చెందుతుంది. డెట్‌కు కేటాయింపులు పెంచుకున్నకొద్దీ అంతిమంగా నికర రాబడులు తగ్గుతుంటాయి'' అని అరుణ్ కుమార్ వివరించారు. నేరుగా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే వారు 70–80 శాతం లార్జ్‌క్యాప్‌నకు, మిడ్‌క్యాప్ స్టాక్స్‌కు 10–15 శాతం, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌కు 5–10 శాతం మధ్య కేటాయించుకోవచ్చని సూచించారు. ఫండ్స్ ద్వారా అయినా సరే ఇంతే మేర ఆయా విభాగాల ఫండ్స్‌కు కేటాయింపులు చేసుకోవచ్చు.



బాలాజీ అమైన్స్ | సీడీ ఈక్విసెర్చ్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 2,188 **టార్గెట్:** రూ. 2,653

ఎందుకంటే: గత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో స్పెషాలిటీ కెమికల్స్, ఫార్మా సంబంధ ప్రొడక్టుల కంపెనీ బాలాజీ అమైన్స్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో మొత్తం ఆదాయం 35 శాతం క్షీణించి రూ. 383 కోట్లకు పరిమితమైంది. ఇందుకు పలు కారణాలు ప్రభావం చూపాయి. చైనా సంస్థలు నిల్వలను తగ్గించుకోవడం(డీస్టాకింగ్), కంపెనీ ఉత్పత్తులను తుదిదశలో వినియోగించే పరిశ్రమలు సవాళ్లు ఎదుర్కోవడం, కీలక ఉత్పత్తుల ధరలు క్షీణించడం వంటి అంశాలు పనితీరును దెబ్బతీశాయి. అంతక్రితం అంటే 2022–23 క్యూ3లో రూ. 586 కోట్ల అమ్మకాలు సాధించింది. ఈ ప్రతికూలతలు డిమాండులోగల ప్రొడక్టుల విక్రయాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ఫలితంగా వీటి అమ్మకాలు 4.4 % నీరసించి 26,903 ఎంటీకి పరిమితమయ్యాయి. అంతక్రితం ఏడాది క్యూ3లో ఇవి 28,147 ఎంటీగా నమోదయ్యాయి. అయితే రానున్న త్రైమాసికాలలో అమ్మకాల పరిమాణం తిరిగి పుంజుకోనుంది. ఇందుకు ఫార్మా, ఏపీఐ పరిశ్రమ జోరందుకోవడం సహకరించనుంది. చైనా కంపెనీల భారీ చౌక దిగుమతుల(డంపింగ్)కుతోడు.. తుదిదశ పరిశ్రమలకు స్థూల ఆర్థిక సవాళ్లు, ముడిసరుకుల ధరల్లో హెచ్చుతగ్గులు తదితర ప్రతికూలతలు గతేడాది తొలి 9 నెలల(ఏప్రిల్–డిసెంబర్) ఫలితాలను దెబ్బకొట్టాయి. చైనా దిగుమతులు తగ్గడం, ముడిసరుకుల ధరల్లో నిలకడ నేపథ్యంలో ప్రస్తుత 2024–25 నుంచి మార్జిన్లు మెరుగుపడే అవకాశముంది.

బంధన్ బ్యాంక్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 188 **టార్గెట్:** రూ. 263

ఎందుకంటే: ప్రయివేట్ రంగ సంస్థ బంధన్ బ్యాంక్ క్రమంగా అన్‌సెక్యూర్డ్ రుణాలను తగ్గించుకుంటోంది. ప్రస్తుతం ఇవి 55 శాతానికిపైగా వాటాను ఆక్రమిస్తుండగా.. సెక్యూర్డ్ రుణాలు 45 శాతాన్ని ఆక్రమిస్తున్నాయి. ఇందుకు అనుగుణమైన వ్యూహాల అమలు ద్వారా అన్‌సెక్యూర్డ్ రుణ విభాగ వాటాను 50 శాతానికి తీసుకురానుంది. దీంతో రానున్న రెండేళ్లలో సెక్యూర్డ్ రుణాల వాటా 50 శాతానికి చేరనున్నట్లు బ్యాంక్ యాజమాన్యం పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో మధ్యకాలానికి నికర వడ్డీ మార్జిన్లు నెమ్మదిగా వెనకడుగు వేసే అవకాశముంది. అయితే మొండి రుణ ఒత్తిడి తగ్గడంతోపాటు.. ప్రస్తుతం రూ. 6,500 కోట్లమేర నమోదైన ఆర్ఐడీఎఫ్ పోర్ట్‌ఫోలియో విలువ క్షీణతకు అడ్డుకట్ట పడనుంది. బ్యాంక్ రుణ వ్యయాలు కొంతమేర సవాళ్లు విసురుతున్నప్పటికీ పోర్ట్‌ఫోలియో పర్యవేక్షణలో మార్పులు, వసూళ్లపై ప్రత్యేక దృష్టి కారణంగా స్లిప్పేజీలు తగ్గేందుకు అవకాశముంది. వెరసి కోవిడ్–19 తదుపరి కొనసాగుతున్న మొండి రుణ సవాళ్ల(స్ట్రెస్ సైకిల్)కు తెరపడనుంది. ఫలితంగా వృద్ధి, లాభదాయకత అంచనాలు, వీటిని సాధించగలిగే స్థాయికి బ్యాంక్ చేరనుంది. రుణ మిక్స్‌లో మార్పుల కారణంగా లాభదాయకత మందగించినప్పటికీ ఈ అంశంలో నిలకడకు వీలు చిక్కనుంది. క్లెయిములకు సంబంధించిన సీజీఎఫ్ఎంయూ పోర్ట్‌ఫోలియోపై ఆడిట్ ఫలితాల కోసం బ్యాంక్ ఎదురుచూస్తోంది. బ్యాంక్ బోర్డ్ ప్రస్తుత ఎండీ, సీఈవో ఘోష్ పదవీకాల పొడిగింపు(2024 జులై నుంచి మరో మూడేళ్లు) ప్రతిపాదనపై ఆర్‌బీఐ నిర్ణయం కోసం వేచిచూస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

బరోడా బీఎన్‌పీ పారిబా నుంచి రిటైర్మెంట్ ఫండ్




పదవీ విరమణ తర్వాత ఆర్థిక అవసరాలకు ఉపయోగపడే నిధిని పోగు చేసుకోవడంలో తోడ్పడేందుకు బరోడా బీఎన్‌పీ పారిబా మ్యుచువల్ ఫండ్ తాజాగా రిటైర్మెంట్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ ఓపెన్ ఎండెడ్ ఫండ్, అయిదేళ్ల లేదా 58 ఏళ్ల రిటైర్మెంటు వయస్సు (ఏది ముందైతే అది) లాకిన్ పీరియడ్‌తో ఉంటుంది. ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సాధనాలు, ఫిక్స్‌డ్ ఇన్‌కం సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా రాబడి అందించడం, పెట్టుబడిని పెంచడం లక్ష్యంగా ఈ స్కీము పని చేస్తుంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో) మే 22తో ముగుస్తుంది. దీనికి క్రిసిల్ హైబ్రిడ్ 35+65 అగ్రెసివ్ ఇండెక్స్ అనేది బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. ఏకమొత్తంగా లేదా సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేయొచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

13-5-2024 ఫామ్ ధర...

విశాఖ	550–00
చిత్తూరు	608–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535–00
వరంగల్	537–00
రిటైల్ ధర	5.95

వేర్వేరు లక్ష్యాలకు పెట్టుబడులు ఎలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ప్రతీ లక్ష్యానికి విడిగా ప్రత్యేకమైన పోర్ట్‌ఫోలియో అవసరమా? – జోసెఫ్


ముందుగా సమీప కాలంలోని లక్ష్యాలను నిర్ణయించుకోండి. అలాగే, మధ్య కాలం, దీర్ఘకాల లక్ష్యాలను వేరు చేయండి. ఇప్పుడు స్వల్పకాల, మధ్యకాల లక్ష్యాలలో.. రాజీ పడేవి, రాజీపడలేనివి అంటూ రెండు భాగాలు చేయండి. రాజీపడలేని అంటే రిస్క్ తీసుకోలేని పెట్టుబడులు. రిస్క్ తీసుకోలేని స్వల్ప, మధ్యకాల లక్ష్యాల కోసం ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (స్థిరాదాయ/డెట్) సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. వీటికోసం ఒక్కటే పోర్ట్‌ఫోలియో సరిపోతుంది. ఈ పెట్టుబడుల కోసం ఈక్విటీలపై ఆధారపడకూడదు. అవసరమైనప్పుడు వెంటనే తీసుకునేందుకు అనుకూలంగా ఉండాలి. ఇక దీర్ఘకాలం కోసం ఉద్దేశించిన పెట్టుబడులను అంటే వచ్చే ఐదేళ్లలోపు అవసరం లేని పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించుకోవాలి. ప్రతీ లక్ష్యానికి విడిగా ఎంత కాలం ఉంది? ఎంత చొప్పున కావాలి? ఎంచుకునే సాధనాలు? వాటిల్లో రాబడి ఎంత? ఈ అంశాల ఆధారంగా ఎంత మొత్తం ఇన్వెస్ట్ చేసుకోవాలన్నది నిర్ణయించుకోవడం సాధ్యపడుతుంది. మీ లక్ష్యానికి కావాల్సిన నగదు మీరు కోరుకున్న సమయంలో లభించేలా ప్రణాళిక ఉండాలి. ఉదాహరణకు వచ్చే మూడేళ్ల కాలంలో రూ.5 లక్షలు కావాలి, ఐదేళ్లలో రూ.5 లక్షల కావాలనుకుంటే లేదా 25–30 ఏళ్లలో రూ.కోటి రూపాయలు (రిటైర్మెంట్) కావాలనుకుంటే అందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. స్వల్పకాల లక్ష్యాల కోసం కేవలం బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్, డెట్ సాధానాల్లోనే ఇన్వెస్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఐదేళ్లకు మించిన ఏ లక్ష్యానికైనా డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

మంచి ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకునేందుకు ఏ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి? – వైదేహి

మ్యూచువల్ ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియోని చూడాలి. ఇండెక్స్‌తో పోలిస్తే, సదరు ఇండెక్స్ ఫండ్‌లో రాబడుల తీరు ఎలా ఉందన్నది పరిశీలించాలి. వ్యాల్యూ రీసెర్చ్ పోర్టల్‌లో అన్ని పథకాలకు సంబంధించిన పనితీరు, ఇతర డేటాను పరిశీలించుకోవచ్చు. ఇండెక్స్‌తో పోలిస్తే పథకం పనితీరు ఎలా ఉందన్న సమాచారం కూడా లభిస్తుంది. కొంత ట్రాకింగ్ లోపం ఉండే అవకాశం లేకపోలేదు. అంటే ఇండెక్స్ 2 శాతం పెరిగితే.. ఫండ్ పెట్టుబడుల విలువ అదే కాలంలో 2.01 శాతం, 1.99 శాతంగా చూపించొచ్చు. ముఖ్యంగా ఎక్స్‌పెన్స్ రేషియో కీలకం అవుతుంది. రెండు ఇండెక్స్ పథకాల్లో ఒకటి 10 బేసిస్ పాయింట్లు చార్జ్ చేస్తూ, మరో పథకం 25 బేసిస్ పాయింట్లు చార్జ్ తీసుకుంటుంటే.. అప్పుడు 10 బేసిస్ పాయింట్ల పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడమే సరైనది. దీనివల్ల దీర్ఘకాలంలో అదనపు రాబడి సొంతం అవుతుంది.

గోల్డ్ ఈటీఎఫ్‌లలో అమ్మకాలు..

ఏప్రిల్‌లో లాభాల స్వీకరణ



న్యూఢిల్లీ: గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) లలో గత నెల (ఏప్రిల్) ఇన్వెస్టర్లు నికరంగా రూ. 396 కోట్ల మేర పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అయితే, గోల్డ్ ఫండ్స్ నిర్వహణలో ఉన్న ఆస్తుల పరిమాణం (ఏయూఎం) మార్చి నెలాఖరున ఉన్న రూ. 31,224 కోట్ల నుంచి 5 శాతం పెరిగి రూ. 32,789 కోట్లకు చేరింది. రూపాయి మారకంలో చూస్తే పసిడి గత ఏడాది వ్యవధిలో మెరుగైన పనితీరే కనపర్చినప్పటికీ ఈక్విటీలతో పోలిస్తే తక్కువేనని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా అనలిస్ట్ మెల్విన్ శాంటారీటా తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈటీఎఫ్‌లలో మదుపరులు కొంత లాభాలు స్వీకరించి ఉంటారని ఆయన పేర్కొన్నారు. దీంతో ధర పెరిగినా ఈటీఎఫ్‌ల నుంచి పెట్టుబడులు నికరంగా తరలిపోయి ఉంటాయని వివరించారు. 2023 మార్చి తర్వాత గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి పెట్టుబడులను ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకోవడం ఇదే ప్రథమం. మ్యుచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ) డేటా ప్రకారం గతేడాది మార్చిలో నికరంగా రూ. 266 కోట్లు తరలిపోయాయి. తాజాగా మార్చిలో రూ. 373 కోట్లు వచ్చాయి. ఇక, గోల్డ్ ఈటీఎఫ్‌ల ఫోలియోల సంఖ్య మార్చిలో 50.61 లక్షలుగా ఉండగా.. ఏప్రిల్‌లో సుమారు 1 లక్ష పెరిగి రూ. 51.94 లక్షలకు చేరింది. 2022లో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ. 459 కోట్లు రాగా, 2023లో దానికి అనేక రెట్లు అధికంగా రూ. 2,920 కోట్లు వచ్చాయి. గతేడాది నెలకొన్న పరిస్థితుల కారణంగా సురక్షితమైన పెట్టుబడి సాధనంగా, ద్రవ్యోల్బణానికి తగిన హెడ్జింగ్ సాధనంగా పసిడికి ప్రాధాన్యం గణనీయంగా పెరిగింది. ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు పెరుగుతుండటం, భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఆందోళనకరంగా మారడం తదితర అంశాల వల్ల ఇన్వెస్టర్లు బంగారం వైపు మొగ్గు చూపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 602/A, Rampur Village, Dharmasagar Mandal, Warangal dist - 506151, T.G, and Printed at Jagati Publications Limited,Survey No. 602/A, Rampur Village, Dharmasagar Mandal, Warangal dist - 506151.
Editor: V.Murali,(Responsible for selection of News under the PRB Act) Phone No. 08711-223111, Fax No.08711- 223330, RNI Regn No. TEL TEL/2008/23806.